ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
శనివారం 2 ఆగస్టు 2025

చెత్త నుంచి సంపద

● 439 కేంద్రాల్లో 4 టన్నుల ఎరువు తయారీ ● ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ శ్రీధర్

● వైసీపీ హయాంలో మూతపడిన ఎస్‌డబ్ల్యూఎంఎస్‌లు



మదనపల్లె మండలం కొండామరిపల్లె చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



వానపాములతో తయారైన ఎరువును పరిశీలిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

మదనపల్లెటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): చెత్తే కదా అని తీసిపారేయొద్దు.. చెత్త నుంచి కూడా సంపద సృష్టించవచ్చని సీఎం చంద్రబాబు పదేపదే అంటుంటారు. 2014-19 వరకు గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బృందావనం పేరిట ప్రతి గ్రామ పంచాయతీలోనూ ప్రారంభించారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఈ చెత్త సంపద కేంద్రాలను కక్ష గట్టి మూసివేయించారు. దీంతో గ్రామాల నుంచి సేకరించే వ్యర్థ పదార్థాలతో కంపోస్టుయార్డులు ముక్కులు అదిరేలా కంపుతో నిండిపోయాయి. కానీ టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఎస్‌డబ్ల్యూఎంఎస్ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం) తిరిగి ఊపందుకుంది. కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టడమే కాక ప్రతి వారంలో రెండు రోజులు జిల్లాలోని ఏదో ఒక గ్రామంలోని ఎస్‌డబ్ల్యూఎంఎస్‌లను తనిఖీ చేస్తున్నారు.

సంపద సృష్టే లక్ష్యం

గ్రామాల్లో ప్రతిరోజూ ఇళ్ల నుంచి సేకరించే చెత్తను తడి, పొడి చెత్తగా అక్కడే విడగొడతారు. అక్కడ నుంచి వాహనాల్లో గ్రామ శివారులోని కంపోస్టు యార్డు వద్ద ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తారు. ఇందులో పొడి చెత్తను ఎంచుకుని అందులో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, రాళ్లు తదితర వస్తువులను ఫిల్టర్ చేసేస్తారు. అనంతరం వచ్చే పొడి చెత్తను చెత్తసంపద తయారీ కేంద్రాల్లో నిర్మించిన ప్రత్యేక తొట్టెలో వేస్తారు. ఈ చెత్తపై నీటిని పిచికారి చేసి, అందులో వానపాములను వదులుతారు. 45 నుంచి 50 రోజుల వరకు ఈ చెత్తను కుళ్లబెడతారు. అనంతరం తయారయ్యే వర్మీ కంపోస్టు ఎరువును జల్లెడపట్టి వినియోగానికి సిద్ధం చేస్తారు.

జిల్లాలో రెండు మోడల్ గ్రామాల ఎంపిక

చెత్త నుంచి సంపద తయారే లక్ష్యంగా జిల్లాలోని రెండు గ్రామాలను మోడల్ గ్రామాలుగా పైలెట్ ప్రాజెక్టు చేపట్టారు. రాజంపేట మండలంలోని కూచివారిపల్లె, కలకడ మండల కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయమే పంచాయతీ కార్మికులు ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి చెత్త సేకరించి, తడి, పొడి చెత్తను విడదీస్తారు. డీపీవో రాధమ్మ ఆధ్వర్యంలో ప్రతిరోజూ చెత్త సంపద తయారీ కేంద్రాల వినియోగంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిత్యం పర్యవేక్షిస్తూ అందులో వస్తున్న ఫలితాలను నివేదికలు రూపొందిస్తున్నారు. ఇక్కడ సత్ఫలితాలు వస్తే ఈ విధానం జిల్లా వ్యాప్తంగా అన్ని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, గ్రామాల్లో అమలు చేయనున్నారు.

439 కేంద్రాల్లో 4 వేల కేజీల ఎరువు తయారీ

జిల్లాలోని 30 మండలాల్లో 439 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు మళ్లీ ప్రాణం వచ్చింది. గత ఐదేళ్లుగా ఈ కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం మూసివేయడంతో 1,626 మంది గ్రీన్ అంబాసిడర్లు జీవనాధారం కోల్పోయారు. అంతేకాకుండా కంపోస్టుయార్డుల్లో చెత్త అంతా పేరుకుపోయి దుర్వాసనతో సమీప ప్రాంతాల ప్రజలు రోగాలబారిన పడ్డారు. దీనిపై కలెక్టర్ శ్రీధర్ దృష్టి పెట్టి రెండు నెలల క్రితం జిల్లాలోని 439 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు ప్రాణం పోశారు. ప్రతి చెత్త సంపద కేంద్రానికి ఒక వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు 1187 మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. వీరికి నెలకు రూ.6 వేల నుంచి 10 వేల వరకు వేతనం చెల్లిస్తున్నారు. అంతేకాకుండా గుంటూరు నుంచి వేలాది వానపాములను తెప్పించారు. ఒక్కో చెత్త సంపద కేంద్రానికి మూడు వేలు (50 కిలోల) వానపాములను పంపిణీ చేశారు. వీటితో చెత్తను కుళ్లబెట్టించి ఎరువులను తయారు చేశారు. కేవలం 65 రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా 4 వేల కిలోల ఎరువును తయారు చేశారు. తొలిదశలోనే 4 వేల కిలోల ఎరువును కిలో రూ.8 నుంచి రూ.10 వరకు రైతులకు విక్రయించేలా చర్యలు చేపట్టారు.

1,626 మందికి ఉపాధి



వేపూరికోట వద్ద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ (ఫైల్)

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఈనెల 15న జరిగే 79వ భారత స్వాతంత్ర్య వేడుకలను పండుగ వాతావరణంలో కన్నుల పండుగగా నిర్వహించి విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకల్లో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, వేదికను అందంగా అలంకరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రతినిధులు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సూచించారు. ప్రొటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు అందరికీ పంపించాలన్నారు. పరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండువగా సాగేలా సంసిద్ధం చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటాద్రి, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా పంచాయతీ అధికారిణి రాధమ్మ



పారిశుధ్య చర్యలను పరిశీలిస్తున్న డీపీవో

రైల్వేకోడూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో రాధమ్మ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని వీపీఆర్ కండ్రిక, కె.బుడుగుంటపల్లె పంచాయతీల్లో పారిశుధ్యంపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం పేరుకునిపోతే ప్రజలకు రోగాలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలను అధికారులు, సర్పంచులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెత్త బండ్లు సక్రమంగా గ్రామాల్లోకి వస్తున్నాయా లేదా అనేది ఆరా తీశారు. చెత్త ఎక్కువగా ఉన్నాయని ప్రజలు చెప్పడంతో వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలకు ఆటోలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయవద్దని, స్వచ్ఛభారత్ ద్వారా అనేక చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పారిశుధ్య రహిత రాష్ట్రంగా చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యం గా పెట్టుకున్నారని తెలిపారు. అనంతరం రైల్వేకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగార్జునరావు, రైల్వేకోడూరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రాజు పాల్గొన్నారు.

నేడు మదనపల్లె-పీలేరు జాతీయ రహదారి ప్రారంభం

● జాతికి అంకితం చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి గడ్కరి

● విజయవాడ నుంచి వర్చువల్ కార్యక్రమం



కలికిరి/పీలేరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-పీలేరు మధ్య విస్తరించిన నాలుగు లేన్ల 71వ నంబరు జాతీయ రహదారిని సీఎం చంద్రబాబుతో కలిసి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి శనివారం ప్రారంభించనున్నారు. విజయవాడ నుంచి వర్చువల్ విధానం లో ఈ రోడ్డును ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. మొత్తం మదనపల్లె నుంచి తిరుపతికి నాలుగు లేన్లతో రహదారి విస్తరణ మంజూరైంది. మదనపల్లె నుంచి పీలేరు వర కు, ఆ తరువాత పీలేరు నుంచి తిరుపతి వరకు పనులను రెండు బిడ్లుగా విభజించి టెండర్లు పిలిచారు. మదనపల్లె నుంచి పీలేరు వరకు 56 కి.మీ దూరానికి రూ.1852 కోట్లు ఖ ర్చు చేశారు. మదనపల్లె, పీలేరు, పాక్షికంగా కొద్ది దూరం పుంగనూరు నియోజకవర్గాల పరిధిలో ఈ రహదారిని ఏర్పాటు చేశారు. రూ.1474 కోట్లతో పనులు చేపట్టడానికి 2021 అక్టోబరు 11న ఈ రోడ్డు విస్తరణకు టెండర్లు ఆహ్వానించారు. ఈ ఏడాది జనవరికి పనులు పూర్తి కావలసి వున్నా ఆరు నెలలు ఆలస్యం జరిగింది. మొత్తం మీద పనులు పూర్తయ్యే సరికి 25 శాతం అంచనాలు పెరిగాయి.

కలెక్టర్, ముక్కా చొరవతో కొలిక్కి వచ్చిన బొప్పాయి ధరలు

● టన్ను రూ.9 వేలుగా నిర్ణయం

● వర్షాలు తగ్గితే పెరిగే అవకాశం ఉందన్న కలెక్టర్

4

రెండేళ్లలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం

● టూరిజం సర్క్యూట్‌గా గండికోట, ఒంటిమిట్ట, దేవునికడప

● కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధి

● సీఎం చంద్రబాబునాయుడు

● గూడెంచెరువులో పింఛన్ల పంపిణీ

● గండికోట అభివృద్ధికి శంకుస్థాపనలు



పింఛను అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

కడప/జమ్మలమడుగు/ఎర్రగుంట్ల/ప్రొద్దుటూరు/ముద్దనూరు/మైలవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జేఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం సాగుతుంది. మహానాడులో చెప్పిన విధంగానే పనులు మొదలయ్యాయి. మొదటిదశ స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని 2028 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. శుక్రవారం చంద్రబాబు జమ్మలమడుగులోని గూడెంచెరువులో పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజావేదిక వద్ద ప్రజలతో ముఖాముఖి, గండికోట అభివృద్ధికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గూడెంచెరువులో ప్రజావేదిక వద్ద చంద్రబాబు మాట్లాడుతూ... కడపలో జరిగిన మహానాడులో త్వరలోనే కడపకు స్టీల్‌ప్లాంట్ వస్తుందని, మాట ప్రకారం స్టీల్‌ప్లాంట్‌ను శాంక్షన్ చేశామని, 2028 డిసెంబరు కల్లా ఫేజ్-1 పూర్తిచేయాలని జిందాల్ కంపెనీకి స్పష్టంగా ఆదేశిచ్చామని తెలిపారు. ఈ ప్రాజెక్టు వస్తే జమ్మలమడుగు చాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జిందాల్ సంస్థ కూడా మొదటి దశ రూ.4500 కోట్లు, రెండో దశ రూ.11,850 కోట్లతో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తుందని తెలిపారు. గాలేరు-నగరి కాల్వలు కడప వరకు తీసుకెళతామని చెప్పామని, వచ్చే ఏడాది మొదటికల్లా కడప వరకు గాలేరు-నగరి కాల్వలు పూర్తి చేస్తామన్నారు.

గండికోట అంటే ఒక సుందరమైన ప్రదేశం. అమెరికాలో గ్రాండ్ క్యానన్ ఉంది ఇండియాలో గండికోట ఉంది. ఇది ఇండియాకే గ్రాండ్ క్యానన్ అని, సుందరమైన ప్రదేశమన్నారు. ప్రపంచంలో అతి సుందరమైన ప్రదేశాల్లో గండికోట పదోది అన్నారు. దీన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడానికి రూ.80 కోట్లతో పనులు కూడా ప్రారంభిస్తున్నామన్నారు. అక్కడే కృష్ణదేవరాయల విగ్రహం కూడా రాబోయే రోజుల్లో పెట్టిస్తామన్నారు. ఒక పక్క గండికోట, ఒంటిమిట్ట, మధ్యలో కడప దర్గా ఈ మూడు అనుసంధానం చేయగలిగితే పర్యాటక కేంద్రాలుగా, స్పిరిచువల్ హబ్‌గా తయారవుతుందని, ఈ పనులన్నీ కూడా చేస్తామని తెలిపారు. రాయలసీమ ఒకప్పుడు రాళ్లసీమ అయిపోతుంది, ఎడారిగా మారిపోతుందని మాట్లాడుకున్నాం, అలాంటిది ఇప్పుడు రాయలసీమను రతనాల సీమగా చేసి చూపిస్తున్నామన్నారు. 2024లో ఉమ్మడి కడప జిల్లాలో ఏడు సీట్లు ఇచ్చారు ఈసారి పదికి పదిసీట్లు ఇచ్చేందుకు మీరు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందుకే మీ రుణం తీర్చుకుంటున్నానని చెప్పారు. 2014-19 మధ్య రూ.12,241 కోట్లు ఖర్చు చేసి అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఒక్క హంద్రీనీవాకు రూ.3800 కోట్లు శాంక్షన్ చేసి సంవత్సరంలో పూర్తి చేసిన ఘనత మన ప్రభుత్వానిదే అన్నారు. వర్షాలు పడకపోయినా రిజర్వాయర్లన్నీ కళకళలాడుతున్నాయన్నారు. రాయలసీమలోని జీడీపల్లె, మారాల, చెర్లోపల్లె, అవుకు, గండికోట, బ్రహ్మసాగర్, మైలవరం ప్రాజెక్టులన్నీపూర్తి చేసింది టీడీపీ ప్రభుత్వమన్నారు. శ్రీశైలం జలాశయం వద్ద జలహారతి ఇచ్చాం, అప్పటి నుంచి నీళ్లు వస్తున్నాయన్నారు. సముద్రంలోకి పోయే నీళ్లను వాడుకుంటే అటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు కరువు మాటే ఉండదన్నారు.

కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులలో రూ.5 వేల కోట్లు పెట్టి అభివృద్ధి చేస్తున్నాం, రాయలసీమలో ఆటోమొబైల్, స్పేస్ టెక్నాలజీ, డిఫెన్స్, ఎయిరోస్పెస్, ఎలక్ట్రానిక్, డ్రోన్ సిటీ పెట్టి గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తయారు చేస్తున్నామన్నారు. ఇవన్నీ వస్తే మన పిల్లలు వేరే ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేదు, అవసరమైతే వేరే ప్రాంతం వాళ్లు రాయలసీమకు వచ్చే పరిస్థితి వస్తుందన్నారు. ఈనెల 2వ తేదీ శనివారం అన్నదాత సుఖీభవ రైతులందరికీ డబ్బులు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈనెల 15నుంచి మహిళలకు ఉచిత బస్సు స్త్రీశక్తి ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఇక్కడ పాపాఘ్ని, చిత్రావతి, మాండవ్య, పినాకిని, పెన్నా నదులు ఉన్నాయన్నారు.

తొలుత చంద్రబాబునాయుడు గూడెం చెరువులోని ఉల్సాల అలివేలమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లి ఆమెకు వితంతు పింఛన్ అందించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించి వారి స్థితగతులు తెలుసుకున్నారు. అనంతరం జమ్మలమడుగులో టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. గండికోటలో రూ.78 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. డిసెంబరు 26, 27 తేదీల్లో గండికోట ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. గండికోట అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ అమలు చేసినట్లు తెలిపారు.



సభకు హాజరైన జనం

తంబళ్లపల్లెలో ఖర్జూర సిరులు



- మూడు ఎకరాల్లో ప్రయోగాత్మకంగా ఎడారి పంట
- సాగుకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలం
- ఈ ఏడాది ఆశాజనకంగా పంట దిగుబడి
- మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

తంబళ్లపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎడారి దేశాలతో పాటు మన దేశంలోని రాజస్థాన్ వంటి ఉష్ణ మండల ప్రాంతాల్లో మాత్రమే పండే ఖర్జూర పంటను కరువుకు పేరుగాంచిన తంబళ్లపల్లెలో సాగు చేస్తూ ఖర్జూర సిరులు కురిపిస్తున్నారు ఇద్దరు రైతు అన్నదమ్ములు. ఖర్జూర సాగుకు ఇక్కడి నేల అనుకూలించడంతో మంచి దిగుబడిని సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఒక్కో మొక్క రూ.4500తో కొనుగోలు

ఖర్జూర సాగుకు మొదట్లో పెట్టుబడి ఖర్చు ఎక్కువగానే ఉంటుందని తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ దబ్బలగుట్టపల్లెకు చెందిన రైతు అన్నదమ్ములు ఆర్.వెంకటరెడ్డి, పాపిరెడ్డిలు చెబుతున్నారు. రైతు కుమారులు ఆన్‌లైన్‌లో నిశితంగా శోధించి తక్కువ నీటితో ఇక్కడి నేల, వాతావరణంలో పెరిగి ఎక్కువ కాలం పాటు దిగుబడి వచ్చే ఖర్జూర సాగును ఎంపిక చేసుకున్నారు. 2020 నవంబరులో రాజస్థాన్ రాష్ట్రంలోని జయపూర్‌లో అతుల్ కంపెనీ నుంచి మేలు రకాలైన బర్హీ జాతికి చెందిన ఖర్జూర మొక్కలను తెప్పించి ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. ఒక్కో మొక్కను నర్సరీలో రూ.4500తో కొనుగోలు చేయగా రవాణా చార్జీలు, భూమిలో నాటే కూలీల ఖర్చు కలిపి రూ.5 వేలు వరకు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. మొక్కకు మొక్కకు మధ్య ఎటుచూసినా 22 అడుగులు దూరం ఉండేలా 3 అడుగుల వెడల్పు, లోతు ఉండేటట్లు గొయ్యి తీసి నాటించారు. మూడు ఎకరాలకు కలిపి 210 (ఎకరాకు 70 మొక్కలు చొప్పున) మొక్కలను నాటారు. ఎకరాకు 70 నుంచి 80 మొక్కలు నాటుకోవచ్చు. ఇందులో ఒక్కో తోట చుట్టూ అక్కడక్కడా ఆడ చెట్లకు క్రాసింగ్ కోసం 8 మగ ఖర్జూర మొక్కలను నాటారు. ఇలా ఇద్దరు రైతులు కలిపి మూడు ఎకరాల్లో (ఒక్కొక్కరు ఒక టిన్నర ఎకరంలో) పంట సాగు చేసి మొక్కలను నాలుగు సంవత్సరాల పాటు జాగ్రత్తగా సంరక్షించారు. సాగుకు ఇక్కడి ప్రాంతం అనుకూలించడంతో గత ఏడాది జూలైలో మొదటిసారి పంట తీయగా..ఈ ఏడాది రెండోసారి పంట దిగుబడి ప్రారంభమైంది. జూలై, ఆగస్టు నెలల్లో మాత్రమే పంట దిగుబడి వస్తుందని, చెట్లను జాగ్రత్తగా కాపాడుకుంటే దాదాపు 60 ఏళ్లకు పైగా దిగుబడి పొందవచ్చని రైతులు చెబుతున్నారు.

మూడున్నర నుంచి నాలుగేళ్లకు దిగుబడి

ఖర్జూర మొక్కలు నాటిన మూడున్నర నుంచి నాలుగు సంవత్సరాల లోపు కాపుకు వస్తాయి. చెట్లకు ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారంలో పూత రావడం ప్రారంభమవుతుంది. తోట చుట్టూ పరాగసం పర్కం కోసం కొన్ని మగ చెట్లను పెంచాల్సి ఉంటుంది. ఈ మగ చెట్లు కేవలం పూత మాత్రమే పూస్తాయి. ఆ పూతను ఎండబెట్టి ఆ పుప్పొడిని ఆడ చెట్లకు వచ్చిన పూతతో పరపరాగ సంపర్కం (క్రాసింగ్) చేస్తారు. ఒకవేళ మగ చెట్లు లేకుంటే ఈ పుప్పొడి రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో కూడా దొరుకుతుంది. తోటలో చెట్టుకు ఉన్న ప్రతి గెలకు జాగ్రత్తగా క్రాసింగ్ చేపట్టాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆడ చెట్లకు పూసిన పూత ఫలదీకరణం చెంది పిందెలు అయ్యి గెలలుగా తయారవుతాయి. కాయలు ఆకుపచ్చ రంగులోంచి పూర్తిగా పసుపు, నారింజ రంగులోకి వచ్చినపుడు మాత్రమే కోసుకోవాలి. ప్రస్తుతం తోటలో ఉన్న ఒక్కో చెట్టుకు సరాసరి 4 నుంచి 8 గెలల వరకు వచ్చాయి. ఒక్కో గెల సుమారు 8 నుంచి 15 కిలోలకు పైగా వరకు బరువు ఉంటుంది. రెండో పంట కావడంతో ఒక్కో చెట్టుకు సుమారు 60 నుంచి 100 కిలోలకు పైగా దిగుబడి వస్తుందని మొత్తం మూడు ఎకరాల్లో కలిపి సుమారు 6 నుంచి 7 టన్నులకు పైగా దిగుబడి రావచ్చునని అంచనా వేస్తున్నారు.

కాండం తొలుచు పురుగు సమస్య

ఖర్జూరపు చెట్లకు కాండం తొలుచు పురుగు సమస్య ఎక్కువగా ఉంటుంది. చెట్లకు కింద ఉన్న చెత్త ద్వారా కాండం భాగంలో పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆ పురుగులు కంటికి కనిపించవు. పురుగులు కాండం భాగంలో చెట్టుకు రంధ్రం చేసుకుని లోపలి వరకు పొడిచి తింటాయి. పురుగులు పట్టకుండా ఉద్యాన అధికారుల సూచనల మేరకు కీటక నాశనులను చెట్టు పైభాగం నుంచి మొదలు వరకు పూర్తిగా తడిచేలా స్ప్రే చేయాలి. డ్రిప్‌లో కూడా కీటక నాశనులను మొక్కకు అందించాల్సి ఉంటుంది. అంతేకాకుండా కాయలు పక్వానికి వచ్చే సమయంలో పక్షులు, ఉడతల బారి నుంచి పంటను కాపాడుకోవాలి. దీని కోసం కాయలు పైకి కనిపించకుండా గెలలకు తెల్లటి ప్లాస్టిక్ కవరును కట్టుకోవాలి. చెట్టు ఒక్కసారి నాటుకుని కాపాడితే 60 ఏళ్లకు పైగా ఏడాదికి ఒకసారి దిగుబడి పొందవచ్చు.

నీటి అవసరం తక్కువ

ఖర్జూర చెట్లు సాధారణంగా ఉష్ణ మండల ప్రాంతాల్లో పెరుగుతాయి కాబట్టి పంటకు నీరు అవసరం అంత ఎక్కువగా ఉండదు. మొక్క సైజును బట్టి నీరు అందించాల్సి ఉంటుంది. వర్షాకాలంలో అయితే నీటి అవసరం పెద్దగా ఉండదు. వేసవి కాలంలో అవసరాన్ని బట్టి మూడు నుంచి నాలుగైదు రోజులకు ఒకసారి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. చెట్ల మొదళ్లలో మేక, గొర్రెలు, పశువుల పేడను ఎరువులుగా అందిస్తే మొక్క బాగా ఏపుగా పెరుగుతుంది.

మార్కెటింగ్ సౌకర్యం లేదు



ఖర్జూర సాగుకు మన ప్రాంతం అనుకూలంగానే ఉన్నా గత ఏడాది మార్కెటింగ్ సమస్యతో చాలా ఇబ్బంది పడ్డాం. ఈ చుట్టు పక్కల ప్రాంతాల్లో నాకు తెలిసి ఇటువంటి పంట లేదు. గత ఏడాది వచ్చిన పంటను స్థానికంగా కొంత, బెంగళూరు, తిరుపతి, మదనపల్లె వంటి పట్టణాలకు తీసుకువెళ్లి మరికొంత విక్రయించాం. మంచి ఆదాయమే అయినా రవాణా ఖర్చులు, మార్కెట్‌లో దళారీల సమస్య వంటి కారణాలతో చాలా ఇబ్బంది పడ్డాం. పంటకు మొదట్లో పెట్టుబడి ఎక్కువగా పెట్టాల్సి వస్తుంది కాబట్టి సామాన్య, మధ్య తరగతి రైతులు ఇటువంటి పంటను సాగు చేయాలంటే కొంచెం ఆలోచించాలి.

- వెంకటరెడ్డి, ఖర్జూర రైతు, దబ్బలగుట్టపల్లె

మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

మంచి పోషక విలువలు కలిగిన ఖర్జూర కాయలకు మన ప్రాంతంలో మార్కెటింగ్ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో గత ఏడాది పంటను విక్రయించుకోవడానికి కొంత ఇబ్బందులు పడినట్లు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా గత ఏడాది గుజరాత్ నుంచి కాయలు ఎక్కువగా రావడంతో ఇక్కడ పండిన కాయలకు డిమాండ్ తగ్గడంతో పాటు ధర కూడా తక్కువగా పలికిందని చెబుతున్నారు. గుజరాత్ కాయలతో పోలిస్తే ఇక్కడి ప్రాంతంలో పండిన కాయలు తియ్యదనం ఎక్కువగా ఉండటంతో పాటు చెట్టు నుంచి కోసిన పదిహేను, ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయని చెప్పారు. గత ఏడాది తిరుపతి, బెంగళూరు, మదనపల్లె మార్కెట్లలో కిలో రూ.180 నుంచి రూ.250 వరకు విక్రయించినట్లు తెలిపారు. రైతుల కుమారులు ఉద్యోగ రీత్యా బెంగళూరు నగరంలో ఉండటంతో వీఆర్ ఫార్మ్స్. ఫ్రెష్ బర్హీ డేట్స్ పేరుతో ఆన్‌లైన్‌లో కిలో రూ.150 నుంచి 200లతో విక్రయించినట్లు తెలిపారు. ఈ ఏడాది తొలి కోతను వారం రోజుల క్రితం బెంగళూరులోని ఓ కంపెనీకి కిలో రూ.180లతో 200 కేజీలు విక్రయించినట్లు రైతులు తెలిపారు. ఇటువంటి పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరిన్ని నూతన పంటలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతారని రైతులు చెబుతున్నారు.



తంబళ్లపల్లెలోని ఖర్జూర తోట



కాయలకు తొడిగిన కవర్లు

స్వాతంత్ర్య దినోత్సవ పెరేడ్‌కు ఎంపిక



మనోజ్ కుమార్ | కుషాల్ కుమార్ | కే. చందు | శశికుమార్ రెడ్డి | ఎం. రాజేంద్ర

పీలేరు రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ పెరేడ్‌కు స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు ఎన్‌సీసీ కేడెట్లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం కళాశాల గౌరవాన్ని పెంచిందన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ 29 ఆంధ్ర బెటాలియన్‌లో సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అత్యుత్తమంగా నిలవడానికి కేడెట్లు సాధించిన విజయాలే కారణమని తెలిపారు. ఒకే కళాశాలకు చెందిన ఐదుగురు కేడెట్లు స్వాతంత్ర్య వేడుకల పెరేడ్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరి ఎంపిక ఇతర కేడెట్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు.

బొప్పాయి లారీ ప్రమాద బాధితులకు పరిహారం పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బొప్పాయి లారీ బోల్తా పడిన ఘటనలో అసువులు బాసిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన శెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన దుర్గయ్య, గంగమ్మ, చెంచమ్మ, సుబ్బరత్న కుటుంబాలకు ఒక్కొకరికి రూ.3 లక్షల చొప్పున పరిహారం అందించింది. ఈ మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ శుక్రవారం బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేయాలని కోరానన్నారు. ప్రమాదం జరిగిన నాడు బాధితుల కుటుంబాలకు ముక్కా ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలు ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించిన పరిహారంతో పాటు రూ.50 వేల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. తహసీల్దార్ అమర్‌నాథ్, శెట్టిగుంట సీనియర్ నాయకులు నీలకంఠయ్య, చంద్ర, మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా, బత్తిన వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వెలిగల్లు కుడి కాలువకు నీరు విడుదల

గాలివీడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడి కాలువకు ఈ నెల 3న ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈ భాస్కర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటల సాగుకోసం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారని, ఆ మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

కడప రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందుల , ఒంటిమిట్ట జడ్పీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నాటికి ముగిసింది. జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు మూడు రోజుల పాటు నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ, జనసేన, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నువ్వా నేనా అంటూ పెద్ద ఎత్తున నామినేషన్లను వేశారు. రెండు స్థానాలకు మొదటి రోజు 5, రెండవ రోజు 8, మూడవ రోజు 32 ఇలా మొత్తం 45 నామినేషన్లు వచ్చాయి. ఇందులో పులివెందుల జడ్పీటీసీకి 19. ఒంటిమిట్ట జడ్పీటీసీకి 26 దాఖలయ్యాయి. నామినేషన్ల పత్రాలను నేడు ఆగస్టు 2న ఉదయం 8 గంటల నుండి పరిశీలన చేయనున్నారు. కాగా పులివెందుల జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి సతీమణి లతాదేవి శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసులరెడ్డి(వాసు), ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిల సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు.

ఆలయంలో హుండీ చోరీ





చోరీ జరిగిన ఆలయం, రోడ్డుపై పడేసిన హుండీ

పీలేరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముడుపుల వేములవారిపల్లె సమీపంలోని ప్రసన్న అంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. గురువారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు కుమార్‌స్వామి ఆలయానికి తాళం వేసుకుని వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున ఆలయానికి వెళ్లిన ఆయన గేట్లు తెరచి ఉండడం చూసి హుండీ చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, దొంగలు హుండీలోని సొమ్ము తీసుకుని పీలేరు - కడప జాతీయ రహదారిలోని యల్లమంద క్రాస్ వద్ద డివైడర్‌పై హుండీని వదిలి వెళ్లారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం

బి.కొత్తకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించిందని పోలీసులు తెలిపారు. మొటుకు పంచాయతీ పరిధిలోని పులుసుమానిపెంటకు చెందిన శివశంకర రోజూ మద్యం తాగి వస్తున్నాడని ఆయన భార్య లక్ష్మీదేవి గొడవ చేసేది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీదేవి శుక్రవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబీకులు ఆమెను మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఒకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

చిన్నమండెం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులో షేక్. సద్దాం అనే యువకుడిని అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలు వెలడించారు. గురువారం సాయంత్రం తూర్పుపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ రాయచోటిలోని ఏజీ గార్డెన్, ప్రాంతానికి చెందిన మెకానిక్ షేక్. సద్దాంను అనుమానంతో అదుపులోకి తీసుకున్నాడు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ చేయగా అతను ప్రమాణిస్తున్న వాహనంతో పాటు మరో ఐదు మోటార్ సైకిళ్లను చోరీ చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. ఏఎస్ఐ అంజిరెడ్డి, కానిస్టేబుల్ పెంచలయ్య, మస్తాన్, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అప్పులబాధ తాళలేక అరటి వ్యాపారి ఆత్మహత్య

పులివెందుల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక అరటి కాయల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. యర్రబల్లె తాండాకు చెందిన బుక్కే. అంజనేయులునాయక్ (42) కొన్నేళ్లుగా రైతుల వద్ద అరటి పంటకొని ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాల్లో విక్రయించేవాడు. ఆ వ్యాపారులు కొన్ని రోజులుగా డబ్బు చెల్లించకపోవడంతో ఆయన రైతులకు డబ్బు చెల్లించలేకపోయాడు. రోజురోజుకు ఒత్తిడి పెరగడంతో అప్పుల బాధ తాళలేక గురువారం మధ్యాహ్నం 2.35 గంటల ప్రాంతంలో పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు.

కలెక్టర్, ముక్కా చొరవతో కొలిక్కి వచ్చిన బొప్పాయి ధరలు

- టన్ను ధర రూ.9వేలుగా నిర్ణయం
- 5వ తేదీ నుంచి టన్ను రూ. 10 వేలు
- ఢిల్లీలో వర్షాలు తగ్గితే ధర పెరిగే అవకాశం

రైల్వేకోడూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరల పతనంతో రైల్వేకోడూరులో గురువారం బొప్పాయి రైతులు ఆందోళన చేసిన విషయం విదితమే. కలెక్టర్ చామకూరి శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సహకారంతో శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో దళారులు, రైతులు, మార్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ముద్దలూరు సుబ్బరామరాజు, పందేటి శివకుమార్‌రాజు మాట్లాడుతూ దళారులతో మోసపోతున్నామన్నారు. పీలేరు, కలికిరి, మదనపల్లె, అనంతపురం, ప్రకాశం తదితర ప్రాంతాల్లో బొప్పాయి టన్ను రూ.16 నుంచి 15 వేలు ఉండగా రైల్వేకోడూరులో ఎందుకు ఇంతగా ధరలు తగ్గించారన్నారు. రైల్వేకోడూరులో మొదట టన్ను రూ.16 ఉండగా రానురాను టన్ను రూ.7 వేలకు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఢిల్లీ, రాజస్థాన్ మార్వాడీలతో కలెక్టర్ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులు, దళారులు, రైతులతో కలిసి మూడున్నర గంటల పాటు చర్చలు జరిపారు. ముందుగా మార్వాడీలతో సపరేటుగా చర్చలు జరిపారు. టన్నుకు రూ.9 వేలకు తగ్గకుండా ఈ నెల 4వ తేదీ వరకు ఉంటుందని, 5వ తేది నుంచి రూ.10 వేలు ఉంటుందని కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ అయినంత వరకు టన్ను రూ.9 వేలు ఉంటుందన్నారు. ఢిల్లీ, తదితర నగరాల్లో వర్షాల కారణంగా మార్వాడీలు బొప్పాయి ధరలను తగ్గించారన్నారు. మార్వాడీల సమస్యలు, దళారుల బాధలు కూడా తెలుసుకున్నామన్నారు. రోజుకు 200 లారీల్లో కాయలు వెళ్లే విధంగా వ్యాపారులు చర్యలు తీసుకుంటున్నామన్నారన్నారు. బొప్పాయి లారీలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయరాదన్నారు. ఈ విషయం ఎస్పీ విద్యాసాగర్ నాయుడితో మాట్లాడతామన్నారు. అవాంఛనీయ సంఘటలను జరగకుండా సీఐ పసుపుల వెంకటేశ్వర్లు భద్రత కల్పించారు. రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, జిల్లా మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, రాజంపేట బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, రైల్వేకోడూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, గునిపాటి రాయుడు, పగడాల చంద్రశేఖర్, జోగినేని మణి, కొమ్మా శివ, గిరి తదితరులు పాల్గొన్నారు.

దమ్మ నిరసనకు అనుమతి లేదు: డీఎస్పీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో మదనపల్లెలో ఈ నెల 9న తలపెట్టిన 'దమ్మ నిరసన, చలో మదనపల్లె' కార్యక్రమానికి అనుమతి లేదని స్థానిక డీఎస్పీ మహేంద్ర ప్రకటించారు. స్థానిక వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. అంకిశెట్టిపల్లె సమీపంలోని నల్లగుట్టపై ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహం ధ్వంసం ఘటనలో బాస్ నేతలు, వారి అనుచరులు పోలీసులపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ధ్వంసం చేస్తే ఆ గ్రామ రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను గుర్తించినట్లు తెలిపారు. అయితే తాము చెప్పినట్లు వినలేదని, వారు రాసిచ్చినట్లు కేసు నమోదు చేయలేదనే కోపంతో పోలీసులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. పోలీసుల అనుమతి లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ఆందోళనలు చేశారని, అందుకే కేసులు పెట్టాల్సివచ్చిందని ఆయన స్పష్టం చేశారు. నిందితులను అరెస్టు చేయలేదని మొదట్లో ఆందోళన చేయగా, తర్వాత కేసు విచారణలో నిందితులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయినా.. బాస్ నేతలు, వారి అనుచరులు పోలీసులపై నిందలు మోపుతూ వాట్సాప్, సోషల్ మీడియా, మీడియా సమావేశాల్లో అసత్యాలు ప్రచారం చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇలా పోలీసులపై దుష్ప్రచారం చేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐలు రామ చంద్ర, కళా వెంకటరమణ, ఎస్సై అన్వర్ బాషా, రెహ్మాన్ పాల్గొన్నారు.

ల్యాండ్రీ దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ. లక్ష ఆస్తి నష్టం
- సకాలంలో స్పందించిన ఫైర్, పోలీస్
- తప్పిన పెను ప్రమాదం



ల్యాండ్రీ దుకాణంలో ఎగసిపడుతున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పీలేరు రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్రీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో పెద్ద ఎత్తున దుస్తులు కాలిపోయి రూ. లక్ష మేరకు నష్టం వాటిల్లినట్లు దుకాణ యజమాని శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బోడుమల్లువారి పల్లెకు చెందిన శ్రీనివాసులు పట్టణంలోని జండామాను వద్ద నిర్వహిస్తున్న ల్యాండ్రీలో శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ సమాచారం అందుకున్న పీలేరు ఫైర్ స్టేషన్ సిబ్బంది , పోలీసులు సకాలంలో స్పందించి మంటలు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. పీలేరు అర్బన్ ఎస్ఐ లోకేశ్ తన సిబ్బందితో అక్కడే ఉండి ట్రాఫిక్‌ను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దుస్తులతోపాటు కొంత నగదు కాలి బూడిదైంది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పీలేరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసు భవనానికే దిక్కు లేదు.. పర్యాటకుల రక్షణ ఎలా?

- మందుబాబులకు అడ్డాగా హెల్ప్‌డెస్క్ భవనం



హార్సిలీ హిల్స్‌పై పర్యాటకుల రక్షణార్థం నిర్మించిన హెల్ప్‌డెస్క్ భవనం

బి.కొత్తకోట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పర్యాటకుల రక్షణ లక్ష్యంగా హార్సిలీహిల్స్‌లో ఏర్పాటైన పోలీస్‌హెల్ప్ డెస్క్‌కు మకిలి పట్టింది. రాష్ట్రంలోని నాలుగు ప్రముఖ పర్యాటక కేంద్రాలలో పోలీస్ అవుట్‌పోస్టులను అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ అవుట్‌పోస్ట్‌లో తగినంత మంది సిబ్బంది ఎల్లవేళలా శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సి వుంది. అది ఎలాగూ అమలు కాలేదు. కాగా , హిల్స్‌పై పర్యాటకులు ఎక్కువగా సంచరించే, రాత్రిళ్ల పార్టీలకు నిలయమైన గాలిబండ వద్ద పోలీస్ హెల్ప్‌డెస్క్ పేరుతో ఓ సుందర భవనాన్ని నిర్మించారు. 2023 నవంబరు 23న అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, కలెక్టర్ గిరీశ ప్రారంభించారు. ఓ కానిస్టేబుల్‌ను ఇక్కడ నియమించి పర్యాటకులకు రక్షణ కల్పించాలని నిర్ణయించారు. కొంతకాలం ఈ విధానం అమలైంది. దీంతో గాలిబండ ప్రాంతంలో ప్రశాంతత నెలకొంది. కొంతకాలంగా ఈ హెల్ప్‌డెస్క్‌ను పట్టించుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. మందుబాబుల చిందులు అధికమయ్యాయి. హెల్ప్‌డెస్క్ భవనాన్నే వేదికగా చేసుకొని మద్యం తాగుతున్నారు. తలుపు బద్దలుకొట్టి లోపల చలిమంటలు సైతం వేసుకునే దుస్థితిక వచ్చారు. దీంతో చీకటి పడితే మహిళలు, పిల్లలతో కలిసి గాలిబండవైపు రావడానికే పర్యాటకులు భయపడే స్థితి నెలకొంది. కొండపై పోలీస్ నిఘా లేకపోవడంతో రాత్రిళ్లు బసచేసిన వారు బిక్కుబిక్కు మంటూ గడపాల్సివస్తోందని వాపోతున్నారు. పర్యాటకుల రక్షణ సంగతి అటుంచి ఆ భవనానికైనా రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.



హెల్ప్‌డెస్క్ భవనంలో ఖాళీ మద్యం సీసాలు

కార్యకర్తలకు గుర్తింపునిచ్చే ఏకైక పార్టీ టీడీపీ : సీఎం



జమ్మలమడుగు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రొద్దుటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను గుర్తించే బాధ్యత నాది... పార్టీదని, మీ బాధ్యత ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండటం అని.. నెలనెలా పెన్షన్లు పంచేటప్పుడు బూత్ కన్వీనర్ ఇంటింటికి వెళ్లి కనపడాలని... మన వల్లే పెన్షన్ వచ్చిందని గుర్తుంచుకుంటారని... రేపు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వారికి సైకిలే కనబడుతుందని.. కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటే టీడీపీని ఓడించడం ఎవ్వరికీ సాధ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చా రు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం ముద్దనూరు రోడ్డులోని నానుబాల ఫంక్షన్ హాలులో జరిగింది. ఈసమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ నాయకులు ప్రజలు ఒప్పుకుంటేనే పార్టీలో రాష్ట్రస్థాయి నుంచి జిల్లా మండలస్థాయి వరకు పదవులు ఇస్తున్నామన్నారు. దేవదాయ పాలకమండళ్లు, మార్కెట్‌యార్డు కమిటీలలో, సాగునీటి సంఘాలలో పదవులు ఇస్తున్నామన్నారు. అన్ని స్థాయిలలో కార్యకర్తలకు గుర్తింపు నిచ్చే ఏకైకపార్టీ టీడీపీనే అన్నారు. అందువల్లే కోటి కుటుంబాలు టీడీపీతో ఉన్నాయన్నారు.

సూపర్‌సిక్స్ సూపర్ సక్సెస్

ఎన్నికల ముందు ప్రజలకు అమ లు చేస్తామన్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయని అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని రీతిలో రూ.32,116 కోట్ల రూపాయలు పెన్షన్లకు ఇస్తున్నామన్నారు. తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఇచ్చామని, పేదల కోసం అన్నా క్యాంటీన్లు, సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. మత్స్యకారులకు పెన్షన్లు ఇస్తున్నామన్నారు. పదిరోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.7వేలు ఇవ్వనున్నామన్నారు. ఆగస్టు 7న చేనేత కార్మికులకు 200 యూని ట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందజేయనున్నామన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

11 సీట్లిచ్చినా రౌడీయిజం చేస్తున్నారు

రాష్ట్ర ప్రజలు వైసీపీకి 11 సీట్లిచ్చినా రౌడీయిజం చేస్తున్నారు. అబద్ధం నిజం చేస్తారు. నిజాన్ని అబద్ధం చేస్తారు. సాక్షిలో గుండెపోటు అంటే అయ్యోపాపం అనుకున్నా. సాయంకాలంకల్లా గొడ్డలిపోటన్నారు. తెల్లవారగానే నాచేతిలో కత్తిపెట్టి నారాసుర రక్త చరిత్ర అన్నారు. నేను హత్యలు చేసే వాణ్ణి కాదు. హత్యలు చేసేవాళ్లను మట్టికరిపిస్తా. ఫ్యాక్షన్ రాజకీయాల నుంచి రాయలసీమను కాపాడిన పార్టీ టీడీపీ అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం, అమరావతిలను విధ్వంసం చేశారు. నేడు విధ్వంసం నుంచి అభివృద్ధి వైపునకు, అప్పుల ఊబి నుంచి ఆర్థిక సమృద్ధివైపునకు తీసుకెళుతున్నాం అన్నారు. ఇక నేరస్థులు రాజకీయ ముసుగులో వస్తున్నారు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరామర్శలకు వెళ్లి అక్కడి నుంచి బెదిరించడం..నేను వస్తే తాటతీస్తాను అంటున్నారని... నేను రాజకీయాలు చేసేవరకు ఎవరి ఆటలు సాగనీయనన్నారు.

సింగపూరును అవమానించారు

ప్రపంచంలో అవినీతికి తావులేని దేశం సింగపూర్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సింగపూరు ప్రభుత్వాన్ని అవమాన పరిచారన్నారు. టీడీపీ వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులకు నమ్మకం కలిగించామన్నారు. 30 ఏళ్ల నమ్మకంతో నన్ను వారు ఒదులుకోలేక పోయారు. మళ్లీ సింగపూర్‌తో సంబంధాలు మెరుగు పరుస్తున్నానన్నారు.

ప్రాజెక్టులు, పరిశ్రమలపై హామీలు

రైతాంగం కోసం రాజోలి రిజర్వాయర్ నిర్మాణం చేపడతామన్నారు. జమ్మలమడుగులో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాల్మియ సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ పనులు చేపట్టడంతో పాటు ఆర్‌టీపీపీలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

పులివెందుల జడ్పీటీసీ స్థానం గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్ ఇస్తాం : బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని కైవశం చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గిఫ్ట్‌గా ఇస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసేందుకు అనుమతి ఇవ్వడంతో నామినేషన్ వేశామన్నారు. నా సతీమణి లతా రెడ్డి, తమ్ముడు భరత్‌రెడ్డిలు నామినేషన్లు వేశారన్నారు. అందరి సహకారంతో పులివెందుల జడ్పీటీసీ స్థానం కైవశం చేసుకుంటామన్నారు. పులివెందులలో టీడీపీ బలపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని.. గత అసెంబ్లీ ఎన్నికలలో 25శాతం పార్టీ ఇక్కడ ఉంటే.. 50 శాతానికి టీడీపీని బలోపేతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలుతో పులివెందులలో టీడీపీ బలపడేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణాల్లో నష్టాలు వస్తాయని వైసీపీ నాయకులు వదిలేసిన గ్రావెల్ రోడ్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తి చేశామన్నారు కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

కడప కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం తథ్యమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా అనిల్‌కుమార్ రెడ్డి, శివకళ్యాణరెడ్డిలు తమ నామినేషన్ పత్రాలను జిల్లా పరిషత్‌లో ఎన్నికల అధికారికి అందజేశారు. అంతకముందు విజయజ్యోతి మీడియాతో మాట్లాడుతూ పులివెందుల కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. వైఎస్ తనయురాలు పీసీసీ అధ్య క్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో పులివెందుల జడ్పీటీసి ఉప ఎన్నికలో విజయం సాధించడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్, పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బి.మఠం ఎంపీపీ వైసీపీకి రాజీనామా



ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల ప్రజాపరిషత్ చైర్మన్ (ఎంపీపీ) చిలేం కాంపల్లె వీరనారాయణరెడ్డి శుక్రవారం వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలతో తాను వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశామన్నారు. రాజీనామా పత్రాన్ని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, వైసీపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి పంపినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే టీడీపీలోకి వెళుతున్నట్లు ఎంపీపీ వెల్లడించారు.

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు అన్నా చెల్లెళ్ల ఎంపిక



కడవకల్లు కమ్మయ్య, కడవకల్లు కల్పన

మైలవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దన్నవాడ గ్రామానికి చెందిన అన్నా చెల్లెళ్లు కడవకల్లు కమ్మయ్య, కడవకల్లు కల్పన పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. దన్నవాడ గ్రామానికి చెందిన కడవకల్లు అప్పయ్య, జీవమ్మ దంపతుల కుమారుడు కడవకల్లు కమ్మయ్య, కుమార్తె కడవకల్లు కల్పనలు సివిల్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు. ఐదేళ్ల క్రితం తండ్రి అప్పయ్య మృతి చెందారు. తల్లి జీవమ్మ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేది. తల్లితో పాటు అన్నా చెల్లెలు కూడా కూలి పనులకు, పొలం పనులకు వెళ్లేవారు. ఎటువంటి శిక్షణ తీసుకోకుండా ఇంటిలోనే కష్టపడి చదువుకుని మెరుగైన ఫలితాలు సాధించి కానిస్టేబుల్స్‌గా ఎంపికకావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి విద్యాభ్యాసం 1 నుంచి 5 వరకు దన్నవాడ ప్రభుత్వ పాఠశాల, 6 నుంచి 10 వరకు వద్దిరాల జడ్పీ హైస్కూలు, ఇంటర్, డిగ్రీ జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీల్లో సాగింది.

చేనేత కుటుంబంలో అన్నదమ్ముళ్లకు...



లక్ష్మీనారాయణ, విజయనారాయణ

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఒకే కటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. చింతా చంద్రనారాయణ, శ్యామలాదేవి కుమారులు లక్ష్మినారాయణ, విజయనారాయణ ఏపీఎస్పీ పోలీసులుగా ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకే కుటుంబంలో వదినా, మరిదికి..

కొండాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన వదినా, మరిదిలు శుక్రవారం విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన రైతు కుమ్మర నాగేంద్ర భార్య పావని, అతని తమ్ముడు కుమ్మర హర్షవర్ధన్‌లు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఒకే కుటుంబంలో ఇద్దరు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో వారి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గండికోట ప్రాజెక్టుకు చేరిన కృష్ణాజలాలు



జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా గండికోట ప్రాజెక్టులోకి చేరుతున్న కృష్ణాజలాలు

కొండాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు కృష్ణాజలాలు శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు చేరినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అవుకు రిజర్వాయిర్ వద్ద జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గురువారం నీటిని విడుదల చేయగా, జీఎన్‌ఎస్‌ఎస్ వరదకాలువ ద్వారా 53 కిలోమీటర్లు ప్రయాణించి గండికోట సొరంగం గుండా గండికోట ప్రాజెక్టులోకి నీరు ప్రవేశించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సుమారు 6000 క్యూసెక్కులు నీరు వస్తుండగా అది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులు, సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 300 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో శుక్రవారం 10.3 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు గల్లంతు

- ఒక మృతదేహం లభ్యం - మరొకరి కోసం పోలీసుల గాలింపు



పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు గల్లంతు అయిన నీటి గుంత ఇదే



మున్నా మృతదేహం

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ముద్దనూరు రోడ్డులోని పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో మునిగి గల్లంతయ్యారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గండికోటకు వెళ్లే సమయంలో వెలుగులోకి వచ్చింది. పోలీసల వివరాల మేరకు... కడపకు చెందిన గోపాల్ (36), మున్నా (38) ముఖ్యమంత్రి పర్యటన బారికేడ్స్ కట్టేందుకు గురువారం జమ్మలమడుగుకు వచ్చినట్లు తెలిపారు. పనులు అయిపోయిన తర్వాత పెన్నానదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు నీటి కుంటలో మునిగి గల్లంతు అయ్యారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 8 గంటలకు మున్నా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

కులం పేరుతో దూషించిన కేసులో మూడేళ్ల జైలు శిక్ష

సింహాద్రిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన కేసులో వెలుగోటి రామలింగేశ్వరరెడ్డికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. 2018 మే 4వ తేదీ వెలుగోటి రామలింగేశ్వరరెడ్డి చింతలపల్లె అంకాళమ్మకు చెందిన పొలంలో అక్రమంగా ప్రవేశించి గుంతలు తీశాడు. ఈ విషయం తెలుసుకున్న అంకాలమ్మ రామలింగేశ్వరరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఎందుకు మా పొలంలో గుంతలు తీశారు.. మీపైన కేసు పెడతామన్నారు. దీంతో రామలింగేశ్వరరెడ్డి కోపంతో అంకాళమ్మను ఆమె భర్తను కులం పేరుతో తిట్టి దూషించాడు. కేసు కాకపోతే ఏమైనా పెట్టుకోమని బెదిరించినట్లు, పొలాన్ని పాడుచేసి గుంతలు చేసినట్లు కేసు పెట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి రామలింగేశ్వరరెడ్డిని కోర్టులో ప్రవేశపెట్టగా... విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పీపీ బాలాజీ, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారన్నారు.

5 నుంచి వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): యోగి వేమ న విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 5వ తేదీ నుంచి ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు వెల్లడించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన 2వ సెమిస్టర్ విద్యార్థులు హాజ రు కావాలని ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని కళా శాలల విద్యార్థులు యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లను చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సూచించారు.

బంగారు కుటుంబాలను ఆదుకుందాం

మార్గదర్శులతో సీఎం చంద్రబాబు



దీవెన కుటుంబాన్ని దత్తత తీసుకుంటామంటున్న ఎన్‌ఆర్‌ఐ రామమనోహర్‌రెడ్డి (మార్గదర్శి), నాగమ్మ కుంటుంబాన్ని ఆదుకుంటామంటున్న చెన్నారెడ్డి (మార్గదర్శి)

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల్లో ఆర్థికంగా స్థిరపడినవారు సొంతూర్లోని బంగారు కుబుంటాలను ఆదుకోవాలి. ఈ విషయంలో మీరూ మేమూ కలసి వెళదాం.. అని మార్గదర్శులతో సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జమ్మలమడుగు మండలం గూడెంచెరువు చేనేత కాలనీలో పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. ఇక్కడ బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు బంగారుకుటుంబాల్లోని వారు తమ స్థితిగతులను వివరించారు. వారిని ఆదుకుంటా మని అక్కడికక్కడే మార్గదర్శులు ప్రకటించారు. ఆ వివరాలు..

నేను ఎస్‌ఐని అవుతా... పది మందికి సాయపడతా...

నాపేరు దీవెన. బీఏ చదువుతున్నాను. నాన్నకు 2016లో రెండుసార్లు ఆపరేషన్లు జరిగాయి. రూ.6లక్షలు ఖర్చయ్యింది. మాకు చాలా ఇబ్బందులున్నాయి. అయినా నన్ను చదివిస్తున్నాడు. తమ్ముడ్ని కోల్పోయాం. అమ్మకు చెవుడు. మేము చాలా ఇబ్బందుల్లో ఉన్నాము సార్. మాకు సహాయం చెయ్యండి. ఎస్‌ఐని కావాలన్నది నా సంకల్పం సార్. నేను కూడా పదిమందికి సహాయపడతాను.

సీఎం: భూములేమైనా ఉన్నాయామ్మా...

దీవెన: లేవు సార్.

బాబు: మీనాన్న ఏం పనిచేస్తాడమ్మా....

దీవెన: పెయింటింగ్ పనిసార్. ఒకరోజు పని ఉంటే వారం రోజులు పనివుండదు. ఆయన మీదే మేము ఆధారపడి బతుకుతున్నాం సార్. మీరే మాకు సహాయం చెయ్యాలని కన్నీరు పెట్టడంతో సీఎం చంద్రబాబు బాలికను ఓదార్చారు. బాధపడవద్దు నేనున్నాను.

మీరిచ్చిన స్ఫూర్తే...- రామమనోహర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ

దీవెనను నాకు కలెక్టర్ పరిచయం చేశారు. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నాను. దీవెన బాగా చదువుకుని ఎస్‌ఐ కావాలనే లక్ష్యం ఉంది. ఆమె ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తాను. అలాగే ఆమె తండ్రి భాస్కర్ జీవనోపాధి కోసం ఆటో కావాలని అడిగారు. అది కూడా ఏర్పాటు చేస్తాను. పీ4 అనే ఉద్యమం అనేది 2016లో కూడా స్మార్ట్ వార్డు-స్మార్ట్ విలేజ్‌గా చేశారు. మీ పిలుపు మేరకు ప్రస్తుత సీఎస్ విజయానంద్ కలిసి జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని దత్తత తీసుకుని 2019 ఫిబ్రవరి నాటికి సంపూర్ణ ఆదర్శ గ్రామంగా మీ చేతులమీదుగా అవార్డు తీసుకున్నాము. విద్య, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి అన్ని కార్యక్రమాలను దత్తత తీసుకుంటాం సార్. 500 మందికి ఉపాధి కల్పించాము. ఇంకా ఎవరైన అర్హులుంటే వారందరికీ పని కల్పిస్తాం సార్.

బాబు: ఒక విజన్ తయారు చేసి షార్ట్‌టర్మ్, మిడిల్ టర్మ్, లాంగ్ టర్మ్‌గా డెవలప్‌మెంట్ చెయ్యండి. ఎంతమంది ఉంటే అందరినీ హోలిస్టిక్‌గా అభివృద్ధి చేయాలి.

====================

నాగమ్మ : నా పేరు నాగమ్మ, భర్త లక్ష్మయ్య, మామ నాగయ్య, అత్త బాలమ్మ సార్. మేము వడ్డోళ్లం.

బాబు: పిల్లలేం చేస్తారమ్మా...

నాగమ్మ: ఒకరు చదువుకుంటున్నారు. ఒకరు 8నెలల పాప. మేము రోళ్లు చేసుకుంటూ బతుకుతున్నాము. ప్రస్తుతం చాలా ఇబ్బందిగా ఉంది సార్. గ్యాండరు (గ్రైండరు), మిక్సీలు వచ్చిందానివల్ల యాపారం చానా పడిపోయింది. ఇంట్లోకి ఒక్క రూపాయి కూడా రాదు సార్. దీనివల్ల చాలా ఇబ్బందిగా ఉంది.

బాబు: తల్లికి వందనం పడిందామ్మా

నాగమ్మ: పడింది సార్.

బాబు: గ్యాస్ వస్తోందా...

నాగమ్మ: లేదు సార్.

బాబు: వెంటనే పెట్టుకో కనెక్షన్ ఇస్తారు.

నాగమ్మ కుటుంబాన్ని ఆదుకుంటా... చెన్నారెడ్డి

మైలవరం మండలంలోని చిన్నవెంతుర్ల గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టి 30 సంవత్సరాల క్రితం హైదరాబాదుకు వెళ్లాను సార్. కన్‌స్ట్రక్షన్‌లో బాగా రాణించాను. అక్కడ ముగ్గురు పిల్లల్ని చదివిస్తున్నాను. నాగమ్మ పిల్లలకు కావాల్సిన విద్య, ఆరోగ్యం, భర్తకు ఆటో కూడా ఇప్పిస్తాను సార్. మరో పది కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేస్తాను.

చంద్రబాబు: మీరు మేము కలిసి ముందుకెళదాము.

పోలీసుల పిల్లలు పోలీసులయ్యారు



పోలీసులుగా ఎంపికైన వారి కుటుంబ సభ్యులతో కమాండెంట్ ఆనందరెడ్డి

సిద్దవటం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలీసు పటాలయంలో విధులు నిర్వహిస్తున్న పోలీసుల కుమారులు మహమ్మద్ షారూఖ్, టి.అరుణ్, షరీఫ్, వినయ్ కుమార్‌రెడ్డి, పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారని బెటాలియన్ కమాండెంట్ ఆనందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోలీసు పటాలయంలో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సిద్దప్ప, టి.సుధాకర్, హుస్సేన్‌బాషా, పి.రవి అనే పోలీసుల కుమారులు కష్టపడి పోలీసు ఉద్యోగం సంపాదించారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి

సిద్దవటం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : భాకరాపేట - సిద్దవటం ప్రధాన రహదారిపై పోలీసు పటాలయం వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని శుక్రవారం స్థానికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీసెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కృష్ణ స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆర్‌అండ్‌బి ఏఈ రామాంజనేయులును వివరణ కోరగా ఈఈ దృష్టికి తీసుకెళతామన్నారు.

అందని నిధులు - ఆవేదనలో కాంట్రాక్టర్లు

● 7 నెలలవుతున్నా రాని సీసీ రోడ్ల నిధులు ● తడిసి మోపెడవుతున్న వడ్డీలు

చిట్వేలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం తీసుకున్న పల్లె పండుగ నిర్ణయంతో పల్లెలు సిమెంటు రోడ్లతో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో సీసీ రోడ్డు నిర్మాణంలో పల్లెలు నూతన శోభను సంతరించుకున్నాయి. ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం, అంతర్గత రహదారులు పరిస్థితి అధ్వానంగా తయారైంది. కొద్దిపాటి వర్షాలకు రోడ్లు కుంటలను తలపిస్తూ బురదమయమవుతున్నా పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాలు మురికి కుంపలుగా మారాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అంతర్గత రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. గ్రామాల్లో సిమెంటు రోడ్డు పనులు జరుగుతుండటంతో అటు కూలీలు, ఉపాధితో పాటు ఇటు ప్రగతి పనులు వేగంగా సాగుతుండడంతో గ్రామ సీమలు నూతన శోభను సంతరించుకుంటున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా తయారైంది సీసీ రోడ్లు వేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి. అప్పులు చేసి మరీ సిమెంటు పూర్తి చేశారు. రోడ్లు పూర్తి చేసి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు నిధులు రాక బావురమంటున్నారు.

గ్రామం వారీగా సీసీ రోడ్డు పనులు

మండలంలో నాగవరం రూ.57.25 లక్షలు, రాజుగుంట రూ.20 లక్షలు, చెర్లోపల్లె రూ.10 లక్షలు, తిమ్మయ్యగారిపల్లె రూ.41.5 లక్షలు, సీఎం రాజుపల్లె రూ.12 లక్షలు, నక్కలపల్లె రూ.10లక్షలు, దేవమాచుపల్లె రూ.5లక్షలు, కంపసముద్రం 12లక్షలు, తిమ్మాయిపాలెం 15లక్షలు, నేతివారిపల్లె 12లక్షలు, కేవీఆర్‌ఆర్ పురం 10లక్షలు, సి.కందులవారిపల్లె 10లక్షలు, చిట్వేలి 21లక్షలు, కేఎస్ అగ్రహారం 8 లక్షలు, మార్లోపల్లె 10 లక్షలతో సీసీ రోడ్లు మంజూరయ్యాయి. 38 వర్కులకు గాను 33 వరకు పూర్తి చేశారు.

తడిసి మోపెడవుతున్న వడ్డీలు

రోడ్డు పనులు పూర్తి అయితే తమకు నాలుగు రూపాయలు వస్తాయనుకున్న గుత్తేదారుల పరిస్థితి దయనీయంగా మారింది. అప్పులు చేసి మరీ సీసీ రోడ్లు వేశారు. రోడ్లు వేసి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు మండలానికి నిధులు రాకపోవడంతో తెచ్చిన డబ్బు తడిసి మోపెడవుతున్నా వడ్డీలతో సతమతమవుతున్నారు. ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు నిధులు రాకపోవడంతో నిస్సహాయ స్థితిలో నిధుల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు.



గుండ్లవారిపల్లెలో వేసిన సీసీ రోడ్డు (ఫైల్)



జోరపల్లెలో వేసిన సీసీరోడ్డు (ఫైల్)

ప్రభుత్వ టీచర్లతో సమానంగా పదోన్నతులు కల్పించాలి

● ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు



మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ అజమాయిషీ కింద ఉన్న పంచాయతీరాజ్, మున్సిపల్ స్కూళ్లను కూడా ప్రభుత్వ పరిధిలోకి తీసుకొని అందులో పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వ టీచర్లతో సమానంగా అన్ని రకాల పోదోన్నతులు కల్పించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని ఎన్టీఏ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ 2020-21లో ఎలాగైతే కొన్ని ఎయిడెడ్ సూళ్ల టీచర్లకు ప్రభుత్వ టీచర్ల హోదా కల్పించారో అదేవిధంగా పంచాయతీరాజ్, మున్సిపల్ స్థానిక సంస్థల పాఠశాలలను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వారికి కూడా ప్రభుత్వ టీచర్ల హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలలకు కావాల్సిన భవనాలు, నిర్వహణా నిధులు, టీచర్ల పర్యవేక్షణతో పాటు టీచర్ల సర్వీసు మాటర్స్, నియమకాలు, పదోన్నతులు అంతా ప్రభుత్వ నిధులతోనే నుస్తున్నాయన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌తో సహా అందరికీ జీతాలు స్కూల్ ఎడ్యుకేషన్ నిధులతోనే వస్తున్నాయన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు మడితాటి నరసింహారెడ్డి, శివభాస్కర్, వేణుగోపాల్, రెడ్డప్పరెడ్డి, మోహన్‌నాయక్, సుబ్బారెడ్డి, శివప్రసాద్, నాగరాజ, రెడ్డయ్య, రెడ్డెన్న, కులశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో ఘనంగా రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరయ్య, కృ ష్ణయ్య స్వాముల వేదమంత్రాల మధ్య భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుదరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలను నిర్వహించారు. ఆల య అర్చకుడు శంకరయ్య స్వామి రాహుకాల పూజల విశిష్టత గురించి మ హిళా భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

భువనేశ్వరి అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రైల్వేకోడూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భుజంగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన భువనేశ్వరి అమ్మవారికి శుక్రవారం శ్రావణమా సం సందర్భంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకుడు దూర్జటి యోగీశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్న తహసీల్దార్



బాధిత పిల్లలతో తహసీల్దార్ అమర్‌నాథ్

రైల్వేకోడూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మామిడి కాయల లారీ ప్రమాద బాధిత పిల్లలను రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్ నాథ్ పీ-4 బంగారు కుటుంబం కింద దత్తత తీసుకున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 13న రాత్రి పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద మామిడి కాయల లోడుతో రైల్వేకోడూరు మార్కెట్ యార్డుకు తరలిస్తుండగా జరిగిన ప్రమాదం లో 9 మంది మృతి చెందారని, మరో 9 మంది తీవ్రంగా గాయపడిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇందులో నలుగురు రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట గిరిజనకాలనీకి చెందిన వారు, మిగిలిన వారు ఇతర ప్రాంతాలకు చెందిన వారున్నారని తెలిపారు. శెట్టిగుంట గిరిజన కాలనీకి చెందిన దుర్గయ్య, గంగమ్మ అనే భార్యభర్తలు ప్రమాదంలో చనిపోయారని, వారి పిల్లలైన సునీత, రాజేశ్వరిలు దిక్కులేని వారుగా మిగిలారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 బంగారు కుటుంబం కింద ఇరువురు పిల్లల్ని దత్తత తీసుకుంటున్నామని తెలిపారు. సునీత రైల్వేకోడూరు జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతుండగా, రాజేశ్వరి 7వ తరగతి చదువుతోందని తెలిపారు. కాగా ప్రభుత్వం నుంచి వచ్చే రూ.3లక్షల చెక్కులను పై అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని బ్యాంకుల్లో అకౌంట్ చేయించే ఏర్పాటు చేస్తామని వివరించారు. వారి విద్యాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తించేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మానస, జిల్లా యానాది సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

● ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ



పార్వతీపురం అంగన్వాడీ సెంటర్ వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీవో వాణిశ్రీ

సిద్దవటం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బిడ్డ పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలని, తల్లీ బిడ్డకు పాలివ్వడం వల్ల గర్భాశయ, రొమ్ముక్యాన్సర్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ తెలిపారు. ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని పార్వతిపురం, దిగువపేట గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ మాట్లాడుతూ తల్లిపాల వల్ల పుట్టిన శిశువుకు సరైన పోషణ అంది రోగ నిరోధకశక్తి పెరిగి అలర్జీ ప్రమాదాలు తగ్గుతాయని, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లి పాలు పట్టాలని తల్లిపాలు శివువుకు అమృతం లాంటిదని, తల్లి పాలు శిశువుకు సులువుగా జీర్ణమవుతాయని, బ్రెయిన్ డెవలప్ మెంట్ ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులు స్నేహభరిత సేవా భావం తల్లికి, తన బిడ్డకు ముర్రుపాలు ఇచ్చేందుగు ప్రోత్సాహం ఇవ్వాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్‌లు శ్రీవిద్య, వరలక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భవతులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోయకొండమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి విగ్రహం

సుండుపల్లె, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): బోయకొండమ్మ, పోతురాజు, సింహ, బలిపీఠం, బలిస్థంభం, స్థిర ప్రతిష్ట మహోత్సవాన్ని ఈ నెల 2 నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్కంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి ప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం గణపతిపూజతో ప్రారంభిస్తామన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు జలాధివాస, దుర్గ, చండీహోమం, మంగళహారతి కార్యక్రాలు, సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. అలాగే సోమవారం సూర్యచంద్ర లక్ష్మి దుర్గా సరస్వతి కల్యాణం, ప్రాణప్రతిష్ఠ, దృష్టిస్థాపన, అమ్మవారి పూజ, మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. మండల నలుమూలల నుంచి భక్తులు హాజరై అమ్మవారి ఆశీర్వాదం పొందాలన్నారు.

సమీకృత బాలుర వసతి గృహం తనిఖీ

పుల్లంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని శ్రీరాముల మిట్టలో ఉన్న సమీకృత బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో జయశ్రీ శుక్రవారం తనిఖీ చేశారు. భోజనశాల, మిడ్ మిల్స్ విద్యార్థులు అందించే శుద్ధమైన తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ బేష్ అని వార్డెన్‌ను ప్రశంసించారు. అలాగే హాస్టల్లో ప్లాంటేషన్, కూరగాయల పెంపకం బాగుందన్నారు. విద్యార్థుల హాజరు, రికార్డు మెయిటినెన్స్, స్టాకు రిజిస్ట్రర్లను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం ఆరగించారు.

ఉపాధ్యాయులపై వివక్ష తగదు



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులపై వివక్ష తగదని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మూడే సూర్యుడునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం దేవళంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరంచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల సహాయకులను మాత్రమే ఎఫ్ఏసీలుగా నిమించడం సమంజసం కాదన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించి అందరికీ సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సైకం గంగిరెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణంరాజు, ఆలూరి నాగరాజ, మల్లూరు నాగరాజు, నాగరత్నమ్మ, రాణి, రాంమోహన్, మదన్‌మోహన్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రైల్వేకోడూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు పట్టణంలోని విజ్‌డమ్ స్కూలులోని పదోవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలను అతివేగంగా నడపరాదన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు తమ బిడ్డలపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారని, వాటిని నిజం చేయాలని సూచించారు.

బ్యాంకు పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

ఓబులవారిపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలని వై.కోట కెనరా బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కసిరెడ్డి తిరుపతి అన్నారు. శుక్రవారం బాలిరెడ్డిపల్లె పంచాయతీలో జనసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మోహన్‌కుమార్, టీడీపీ నాయకులు జీవీ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డికి మంత్రి పరామర్శ



డాక్టర్ మడితాటి మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో నివాసం ఉండే కీర్తిశేషులు టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ మడితాటి రాజారెడ్డి కుమారుడు డాక్టర్ మడితాటి మధుసూదన్‌రెడ్డి ఇటీవలే అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని వారి నివాసం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం వారిని పరామర్శించారు. అలాగే ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్యం కుదుట పడి త్వరలోనే జనస్రంతిలోకి రావాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అంజనేయులురెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

సుండుపల్లె, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గురుప్రసాద్ అన్నారు. శుక్రవారం మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ ముడుంపాడు, మడితాడు గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకాలు నిషేధించామన్నారు. సారా తాగడం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించినట్లు తెలిపారు. మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలోని చిన్నబిడికి, మడితాడు గ్రామ పంచాయతీలోని వానరాచపల్లి బిడికి, ముడుంపాడు గ్రామ పంచాయతీలోని ఆరోగ్యపురం తాండాలను నాటుసారా రహిత గ్రీన్ విలేజ్‌గా ధ్రువీకరించామన్నారు. షాఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రంగనాధుని ఆలయ అభివృద్ధికి కృషి : జనసేన



రంగనాధ ఆలయ అభివృద్ధి పనులు చేయిస్తున్న జనసేన నేత కృష్ణ

సిద్దవటం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రంగనాధుని కోవెల అభివృద్ధికి కృషి చేస్తానని జనసేన నేత కృష్ణ తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని తన సొంత నిధులతో అభివృద్ధి చేపట్టారు. రంగనాధుని ఆలయంలో శుక్రవారం కృష్ణ మాట్లాడుతూ ఉగాది రోజున విగ్రహ ప్రతిష్ఠ చేసి తిరిగి అందుబాటులోకి తెస్తానన్నారు. ప్రహరీ మరమ్మతులు, కల్యాణ మండపానికి విద్యుత్ ఏర్పాటు చేయిస్తానన్నారు.

పలువురు అభ్యర్థుల నామినేషన్

ఒంటిమిట్ట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థులుగా పలువురు నామినేషన్ వేశారు. శుక్రవారం కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసినవారిలో బొడ్డే ముద్దుక్రిష్టారెడ్డి, రఘురామిరెడ్డి, నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, వీరితో పాటు మరికొందరు ఉన్నారు.

ప్రజలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం



రామకృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గాలివీడు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేసుకొని అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కొనియాడారు. సోమవారం కుడుముల రామచంద్రారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం రావడం గొప్ప విషయమని, ఆ ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకోవడం మన అందరి బాధ్యతని పేర్కొన్నారు.

కుడుముల రామచంద్రారెడ్డి వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



రెడ్డిపల్లెలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి

పుల్లంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని రెడ్డిపల్లెపేట గ్రామంలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి శుక్రవారం వృద్ధాప్య పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు రూ.4 వేలు పెన్షన్ ఓ వరమన్నారు. టీడీపీ నాయకులు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, నరసాపురం శివాజీ, నరసాపురం సుబ్బన్న పాల్గొన్నారు.

డ్రగ్స్ ప్రాణాంతకం : ఎస్ఐ

పెనగలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):డ్రగ్స్ ప్రాణాపాయమని పెనగలూరు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పెనగలూరు ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ మహేష్‌నాయుడు అధ్యక్షతన జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన క్రమశిక్షణ, మాదకద్రవ్యాలు, మహిళలు, చిన్నపిల్లలకు శక్తి టీమ్, రోడ్డు భద్రత నియమాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల మాట ఎటువంటి దురలవాట్లు ఏర్పడవన్నారు. అలాగే ప్రతిఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఎస్ఐ రాముడు, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాయుడు, కానిస్టేబుల్ సుజిత, రవి, మణి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-1 గా లావణ్య బాధ్యతలు స్వీకరణ



ఎంఈవోను సన్మానిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట మండల విద్యాశాఖాధికారి-1 లావణ్య బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఆమె ఎంఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరులోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పనిచేస్తూ ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆమెను సన్మానించారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

పెనగలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబిలి గ్రామ పంచాయతీ పరిధిలో గల అత్తిరాల రామాలయంలోని కల్యాణమండపంలో శనివారం సాయంత్రం బీజేపీ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల అధ్యక్షుడు కోనేటి రెడ్డికృష్ణరాయల్ తెలిపారు. ఈ సమావేశాన్ని పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తంబళ్లపల్లెలో ఖర్జూర సిరులు



- మూడు ఎకరాల్లో ప్రయోగాత్మకంగా ఎడారి పంట
- సాగుకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలం
- ఈ ఏడాది ఆశాజనకంగా పంట దిగుబడి
- మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

తంబళ్లపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎడారి దేశాలతో పాటు మన దేశంలోని రాజస్థాన్ వంటి ఉష్ణ మండల ప్రాంతాల్లో మాత్రమే పండే ఖర్జూర పంటను కరువుకు పేరుగాంచిన తంబళ్లపల్లెలో సాగు చేస్తూ ఖర్జూర సిరులు కురిపిస్తున్నారు ఇద్దరు రైతు అన్నదమ్ములు. ఖర్జూర సాగుకు ఇక్కడి నేల అనుకూలించడంతో మంచి దిగుబడిని సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఒక్కో మొక్క రూ.4500తో కొనుగోలు

ఖర్జూర సాగుకు మొదట్లో పెట్టుబడి ఖర్చు ఎక్కువగానే ఉంటుందని తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ దబ్బలగుట్టపల్లెకు చెందిన రైతు అన్నదమ్ములు ఆర్.వెంకటరెడ్డి, పాపిరెడ్డిలు చెబుతున్నారు. రైతు కుమారులు ఆన్‌లైన్‌లో నిశితంగా శోధించి తక్కువ నీటితో ఇక్కడి నేల, వాతావరణంలో పెరిగి ఎక్కువ కాలం పాటు దిగుబడి వచ్చే ఖర్జూర సాగును ఎంపిక చేసుకున్నారు. 2020 నవంబరులో రాజస్థాన్ రాష్ట్రంలోని జయపూర్‌లో అతుల్ కంపెనీ నుంచి మేలు రకాలైన బర్హీ జాతికి చెందిన ఖర్జూర మొక్కలను తెప్పించి ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. ఒక్కో మొక్కను నర్సరీలో రూ.4500తో కొనుగోలు చేయగా రవాణా చార్జీలు, భూమిలో నాటే కూలీల ఖర్చు కలిపి రూ.5 వేలు వరకు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. మొక్కకు మొక్కకు మధ్య ఎటుచూసినా 22 అడుగులు దూరం ఉండేలా 3 అడుగుల వెడల్పు, లోతు ఉండేటట్లు గొయ్యి తీసి నాటించారు. మూడు ఎకరాలకు కలిపి 210 (ఎకరాకు 70 మొక్కలు చొప్పున) మొక్కలను నాటారు. ఎకరాకు 70 నుంచి 80 మొక్కలు నాటుకోవచ్చు. ఇందులో ఒక్కో తోట చుట్టూ అక్కడక్కడా ఆడ చెట్లకు క్రాసింగ్ కోసం 8 మగ ఖర్జూర మొక్కలను నాటారు. ఇలా ఇద్దరు రైతులు కలిపి మూడు ఎకరాల్లో (ఒక్కొక్కరు ఒక టిన్నర ఎకరంలో) పంట సాగు చేసి మొక్కలను నాలుగు సంవత్సరాల పాటు జాగ్రత్తగా సంరక్షించారు. సాగుకు ఇక్కడి ప్రాంతం అనుకూలించడంతో గత ఏడాది జూలైలో మొదటిసారి పంట తీయగా..ఈ ఏడాది రెండోసారి పంట దిగుబడి ప్రారంభమైంది. జూలై, ఆగస్టు నెలల్లో మాత్రమే పంట దిగుబడి వస్తుందని, చెట్లను జాగ్రత్తగా కాపాడుకుంటే దాదాపు 60 ఏళ్లకు పైగా దిగుబడి పొందవచ్చని రైతులు చెబుతున్నారు.

మూడున్నర నుంచి నాలుగేళ్లకు దిగుబడి

ఖర్జూర మొక్కలు నాటిన మూడున్నర నుంచి నాలుగు సంవత్సరాల లోపు కాపుకు వస్తాయి. చెట్లకు ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారంలో పూత రావడం ప్రారంభమవుతుంది. తోట చుట్టూ పరాగసంపర్కం కోసం కొన్ని మగ చెట్లను పెంచాల్సి ఉంటుంది. ఈ మగ చెట్లు కేవలం పూత మాత్రమే పూస్తాయి. ఆ పూతను ఎండబెట్టి ఆ పుప్పొడిని ఆడ చెట్లకు వచ్చిన పూతతో పరపరాగ సంపర్కం (క్రాసింగ్) చేస్తారు. ఒకవేళ మగ చెట్లు లేకుంటే ఈ పుప్పొడి రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో కూడా దొరుకుతుంది. తోటలో చెట్టుకు ఉన్న ప్రతి గెలకు జాగ్రత్తగా క్రాసింగ్ చేపట్టాలి. ఈ పక్రియ పూర్తయ్యాక ఆడ చెట్లకు పూసిన పూత ఫలదీకరణం చెంది పిందెలు అయ్యి గెలలుగా తయారవుతాయి. కాయలు ఆకుపచ్చ రంగులోంచి పూర్తిగా పసుపు, నారింజ రంగులోకి వచ్చినపుడు మాత్రమే కోసుకోవాలి. ప్రస్తుతం తోటలో ఉన్న ఒక్కో చెట్టుకు సరాసరి 4 నుంచి 8 గెలల వరకు వచ్చాయి. ఒక్కో గెల సుమారు 8 నుంచి 15 కిలోలకు పైగా వరకు బరువు ఉంటుంది. రెండో పంట కావడంతో ఒక్కో చెట్టుకు సుమారు 60 నుంచి 100 కిలోలకు పైగా దిగుబడి వస్తుందని మొత్తం మూడు ఎకరాల్లో కలిపి సుమారు 6 నుంచి 7 టన్నులకు పైగా దిగుబడి రావచ్చునని అంచనా వేస్తున్నారు.

కాండం తొలుచు పురుగు సమస్య

ఖర్జూరపు చెట్లకు కాండం తొలుచు పురుగు సమస్య ఎక్కువగా ఉంటుంది. చెట్లకు కింద ఉన్న చెత్త ద్వారా కాండం భాగంలో పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆ పురుగులు కంటికి కనిపించవు. పురుగులు కాండం భాగంలో చెట్టుకు రంధ్రం చేసుకుని లోపలి వరకు పొడిచి తింటాయి. పురుగులు పట్టకుండా ఉద్యాన అధికారుల సూచనల మేరకు కీటక నాశనులను చెట్టు పైభాగం నుంచి మొదలు వరకు పూర్తిగా తడిచేలా స్ప్రే చేయాలి. డ్రిప్‌లో కూడా కీటక నాశనులను మొక్కకు అందించాల్సి ఉంటుంది. అంతేకాకుండా కాయలు పక్వానికి వచ్చే సమయంలో పక్షులు, ఉడతల బారి నుంచి పంటను కాపాడుకోవాలి. దీని కోసం కాయలు పైకి కనిపించకుండా గెలలకు తెల్లటి ప్లాస్టిక్ కవరును కట్టుకోవాలి. చెట్టు ఒక్కసారి నాటుకుని కాపాడితే 60 ఏళ్లకు పైగా ఏడాదికి ఒకసారి దిగుబడి పొందవచ్చు.

నీటి అవసరం తక్కువ

ఖర్జూర చెట్లు సాధారణంగా ఉష్ణ మండల ప్రాంతాల్లో పెరుగుతాయి కాబట్టి పంటకు నీరు అవసరం అంత ఎక్కువగా ఉండదు. మొక్క సైజును బట్టి నీరు అందించాల్సి ఉంటుంది. వర్షాకాలంలో అయితే నీటి అవసరం పెద్దగా ఉండదు. వేసవి కాలంలో అవసరాన్ని బట్టి మూడు నుంచి నాలుగైదు రోజులకు ఒకసారి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. చెట్ల మొదళ్లలో మేక, గొర్రెలు, పశువుల పేడను ఎరువులుగా అందిస్తే మొక్క బాగా ఏపుగా పెరుగుతుంది.

మార్కెటింగ్ సౌకర్యం లేదు



ఖర్జూర సాగుకు మన ప్రాంతం అనుకూలంగానే ఉన్నా గత ఏడాది మార్కెటింగ్ సమస్యతో చాలా ఇబ్బంది పడ్డాం. ఈ చుట్టు పక్కల ప్రాంతాల్లో నాకు తెలిసి ఇటువంటి పంట లేదు. గత ఏడాది వచ్చిన పంటను స్థానికంగా కొంత, బెంగళూరు, తిరుపతి, మదనపల్లె వంటి పట్టణాలకు తీసుకువెళ్లి మరికొంత విక్రయించాం. మంచి ఆదాయమే అయినా రవాణా ఖర్చులు, మార్కెట్‌లో దళారీల సమస్య వంటి కారణాలతో చాలా ఇబ్బంది పడ్డాం. పంటకు మొదట్లో పెట్టుబడి ఎక్కువగా పెట్టాల్సి వస్తుంది కాబట్టి సామాన్య, మధ్య తరగతి రైతులు ఇటువంటి పంటను సాగు చేయాలంటే కొంచెం ఆలోచించాలి.

- వెంకటరెడ్డి, ఖర్జూర రైతు, దబ్బలగుట్టపల్లె

మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

మంచి పోషక విలువలు కలిగిన ఖర్జూర కాయలకు మన ప్రాంతంలో మార్కెటింగ్ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో గత ఏడాది పంటను విక్రయించుకోవడానికి కొంత ఇబ్బందులు పడినట్లు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా గత ఏడాది గుజరాత్ నుంచి కాయలు ఎక్కువగా రావడంతో ఇక్కడ పండిన కాయలకు డిమాండ్ తగ్గడంతో పాటు ధర కూడా తక్కువగా పలికిందని చెబుతున్నారు. గుజరాత్ కాయలతో పోలిస్తే ఇక్కడి ప్రాంతంలో పండిన కాయలు తియ్యదనం ఎక్కువగా ఉండటంతో పాటు చెట్టు నుంచి కోసిన పదిహేను, ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయని చెప్పారు. గత ఏడాది తిరుపతి, బెంగళూరు, మదనపల్లె మార్కెట్లలో కిలో రూ.180 నుంచి రూ.250 వరకు విక్రయించినట్లు తెలిపారు. రైతుల కుమారులు ఉద్యోగ రీత్యా బెంగళూరు నగరంలో ఉండటంతో వీఆర్ ఫార్మ్స్. ఫ్రెష్ బర్హీ డేట్స్ పేరుతో ఆన్‌లైన్‌లో కిలో రూ.150 నుంచి 200లతో విక్రయించినట్లు తెలిపారు. ఈ ఏడాది తొలి కోతను వారం రోజుల క్రితం బెంగళూరులోని ఓ కంపెనీకి కిలో రూ.180లతో 200 కేజీలు విక్రయించినట్లు రైతులు తెలిపారు. ఇటువంటి పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరిన్ని నూతన పంటలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతారని రైతులు చెబుతున్నారు.



తంబళ్లపల్లెలోని ఖర్జూర తోట



కాయలకు తొడిగిన కవర్లు

స్వాతంత్య్ర దినోత్సవ పెరేడ్‌కు ఎంపిక



మనోజ్ కుమార్ | కుషాల్ కుమార్ | కే. చందు | శశికుమార్ రెడ్డి | ఎం. రాజేంద్ర

పీలేరు రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ పెరేడ్‌కు స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు ఎన్‌సీసీ కేడెట్లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం కళాశాల గౌరవాన్ని పెంచిందన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ 29 ఆంధ్ర బెటాలియన్‌లో సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అత్యుత్తమంగా నిలవడానికి కేడెట్లు సాధించిన విజయాలే కారణమని తెలిపారు. ఒకే కళాశాలకు చెందిన ఐదుగురు కేడెట్లు స్వాతంత్య్ర వేడుకల పెరేడ్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరి ఎంపిక ఇతర కేడెట్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు.

బొప్పాయి లారీ ప్రమాద బాధితులకు పరిహారం పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బొప్పాయి లారీ బోల్తా పడిన ఘటనలో అసువులు బాసిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన శెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన దుర్గయ్య, గంగమ్మ, చెంచమ్మ, సుబ్బరత్న కుటుంబాలకు ఒక్కొకరికి రూ.3 లక్షల చొప్పున పరిహారం అందించింది. ఈ మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ శుక్రవారం బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేయాలని కోరానన్నారు. ప్రమాదం జరిగిన నాడు బాధితుల కుటుంబాలకు ముక్కా ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలు ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించిన పరిహారంతో పాటు రూ.50 వేల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. తహసీల్దార్ అమర్‌నాథ్, శెట్టిగుంట సీనియర్ నాయకులు నీలకంతయ్య, చంద్ర, మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా, బత్తిన వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వెలిగల్లు కుడి కాలువకు నీరు విడుదల

గాలివీడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడి కాలువకు ఈ నెల 3న ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈ భాస్కర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటల సాగుకోసం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారని, ఆ మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

కడప రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందుల , ఒంటిమిట్ట జడ్పీ స్థానాలకు నామినేషన్ల పక్రియ శుక్రవారం నాటికి ముగిసింది. జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు మూడు రోజుల పాటు నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ, జనసేన, వైఎస్‌ఆర్‌సీపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నువ్వా నేనా అంటూ పెద్ద ఎత్తున నామినేషన్లను వేశారు. రెండు స్థానాలకు మొదటి రోజు 5, రెండవ రోజు 8, మూడవ రోజు 32 ఇలా మొత్తం 45 నామినేషన్లు వచ్చాయి. ఇందులో పులివెందుల జడ్పీటీసీకి 19. ఒంటిమిట్ట జడ్పీటీసీకి 26 దాఖలయ్యాయి. నామినేషన్ల పత్రాలను నేడు ఆగష్టు 2న ఉదయం 8 గంటల నుండి పరిశీలన చేయనున్నారు. కాగా పులివెందుల జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి సతీమణి లతాదేవి శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసులరెడ్డి(వాసు), ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిల సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు.

ఆలయంలో హుండీ చోరీ




చోరీ జరిగిన ఆలయం, రోడ్డుపై పడేసిన హుండీ

పీలేరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముడుపుల వేములవారిపల్లె సమీపంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. గురువారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు కుమార్‌స్వామి ఆలయానికి తాళం వేసుకుని వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున ఆలయానికి వెళ్లిన ఆయన గేట్లు తెరచి ఉండడం చూసి హుండీ చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, దొంగలు హుండీలోని సొమ్ము తీసుకుని పీలేరు - కడప జాతీయ రహదారిలోని యల్లమంద క్రాస్ వద్ద డివైడర్‌పై హుండీని వదిలి వెళ్లారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం

బి.కొత్తకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించిందని పోలీసులు తెలిపారు. మొటుకు పంచాయతీ పరిధిలోని పులుసుమానిపెంటకు చెందిన శివశంకర రోజూ మద్యం తాగి వస్తున్నాడని ఆయన భార్య లక్ష్మీదేవి గొడవ చేసేది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీదేవి శుక్రవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబీకులు ఆమెను మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఒకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

చిన్నమండెం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులో షేక్. సద్దాం అనే యువకుడిని అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం తూర్పుపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ రాయచోటిలోని ఏజీ గార్డెన్, ప్రాంతానికి చెందిన మెకానిక్ షేక్. సద్దాంను అనుమానంతో అదుపులోకి తీసుకున్నాడు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ చేయగా అతను ప్రమాణిస్తున్న వాహనంతో పాటు మరో ఐదు మోటార్ సైకిళ్లను చోరీ చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. ఏఎస్ఐ అంజిరెడ్డి, కానిస్టేబుల్ పెంచలయ్య, మస్తాన్, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అప్పులబాధ తాళలేక అరటి వ్యాపారి ఆత్మహత్య

పులివెందుల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక అరటి కాయల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. యర్రబల్లె తాండాకు చెందిన బుక్కె ఆంజనేయులునాయక్ (42) కొన్నేళ్లుగా రైతుల వద్ద అరటి పంటకొని ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాల్లో విక్రయించేవాడు. ఆ వ్యాపారులు కొన్ని రోజులుగా డబ్బు చెల్లించకపోవడంతో ఆయన రైతులకు డబ్బు చెల్లించలేకపోయాడు. రోజురోజుకు ఒత్తిడి పెరగడంతో అప్పుల బాధ తాళలేక గురువారం మధ్యాహ్నం 2.35 గంటల ప్రాంతంలో పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు.

కలెక్టర్, ముక్కా చొరవతో కొలిక్కి వచ్చిన బొప్పాయి ధరలు

- టన్ను ధర రూ.9వేలుగా నిర్ణయం
- 5వ తేదీ నుంచి టన్ను రూ. 10 వేలు
- ఢిల్లీలో వర్షాలు తగ్గితే ధర పెరిగే అవకాశం

రైల్వేకోడూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరల పతనంతో రైల్వేకోడూరులో గురువారం బొప్పాయి రైతులు ఆందోళన చేసిన విషయం విదితమే. కలెక్టర్ చామకూరి శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సహకారంతో శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో దళారులు, రైతులు, మార్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ముద్దలూరు సుబ్బరామరాజు, పందేటి శివకుమార్‌రాజు మాట్లాడుతూ దళారులతో మోసపోతున్నామన్నారు. పీలేరు, కలికిరి, మదనపల్లె, అనంతపురం, ప్రకాశం తదితర ప్రాంతాల్లో బొప్పాయి టన్ను రూ.16 నుంచి 15 వేలు ఉండగా రైల్వేకోడూరులో ఎందుకు ఇంతగా ధరలు తగ్గించారన్నారు. రైల్వేకోడూరులో మొదట టన్ను రూ.16 ఉండగా రానురాను టన్ను రూ.7 వేలకు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఢిల్లీ, రాజస్థాన్ మార్వాడీలతో కలెక్టర్ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులు, దళారులు, రైతులతో కలిసి మూడున్నర గంటల పాటు చర్చలు జరిపారు. ముందుగా మార్వాడీలతో సపరేటుగా చర్చలు జరిపారు. టన్నుకు రూ.9 వేలకు తగ్గకుండా ఈ నెల 4వ తేదీ వరకు ఉంటుందని, 5వ తేది నుంచి రూ.10 వేలు ఉంటుందని కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ అయినంత వరకు టన్ను రూ.9 వేలు ఉంటుందన్నారు. ఢిల్లీ, తదితర నగరాల్లో వర్షాల కారణంగా మార్వాడీలు బొప్పాయి ధరలను తగ్గించారన్నారు. మార్వాడీల సమస్యలు, దళారుల బాధలు కూడా తెలుసుకున్నామన్నారు. రోజుకు 200 లారీల్లో కాయలు వెళ్లే విధంగా వ్యాపారులు చర్యలు తీసుకుంటున్నామన్నారన్నారు. బొప్పాయి లారీలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయరాదన్నారు. ఈ విషయం ఎస్పీ విద్యాసాగర్ నాయుడితో మాట్లాడతామన్నారు. అవాంఛనీయ సంఘటలను జరగకుండా సీఐ పసుపుల వెంకటేశ్వర్లు భద్రత కల్పించారు. రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, జిల్లా మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, రాజంపేట బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, రైల్వేకోడూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, గునిపాటి రాయుడు, పగడాల చంద్రశేఖర్, జోగినేని మణి, కొమ్మా శివ, గిరి తదితరులు పాల్గొన్నారు.

దమ్మ నిరసనకు అనుమతి లేదు: డీఎస్పీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో మదనపల్లెలో ఈ నెల 9న తలపెట్టిన 'దమ్మ నిరసన, చలో మదనపల్లె' కార్యక్రమానికి అనుమతి లేదని స్థానిక డీఎస్పీ మహేంద్ర ప్రకటించారు. స్థానిక వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. అంకిశెట్టిపల్లె సమీపంలోని నల్లగుట్టపై ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహం ధ్వంసం ఘటనలో బాస్ నేతలు, వారి అనుచరులు పోలీసులపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ధ్వంసం చేస్తే ఆ గ్రామ రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను గుర్తించినట్లు తెలిపారు. అయితే తాము చెప్పినట్లు వినలేదని, వారు రాసిచ్చినట్లు కేసు నమోదు చేయలేదనే కోపంతో పోలీసులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. పోలీసుల అనుమతి లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ఆందోళనలుచేశారని, అందుకే కేసులు పెట్టాల్సివచ్చిందని ఆయన స్పష్టం చేశారు. నిందితులను అరెస్టు చేయలేదని మొదట్లో ఆందోళన చేయగా, తర్వాత కేసు విచారణలో నిందితులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయినా.. బాస్ నేతలు, వారి అనుచరులు పోలీసులపై నిందలు మోపుతూ వాట్సాప్, సోషల్ మీడియా, మీడియా సమావేశాల్లో అసత్యాలు ప్రచారం చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇలా పోలీసులపై దుష్ప్రచారం చేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐలు రామ చంద్ర, కళా వెంకటరమణ, ఎస్సై అన్వర్ బాషా, రెహ్మాన్ పాల్గొన్నారు.

ల్యాండ్రీ దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ. లక్ష ఆస్తి నష్టం
- సకాలంలో స్పందించిన ఫైర్, పోలీస్
- తప్పిన పెను ప్రమాదం



ల్యాండ్రీ దుకాణంలో ఎగసిపడుతున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పీలేరు రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్రీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో పెద్ద ఎత్తున దుస్తులు కాలిపోయి రూ. లక్ష మేరకు నష్టం వాటిల్లినట్లు దుకాణ యజమాని శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బోడుమల్లువారి పల్లెకు చెందిన శ్రీనివాసులు పట్టణంలోని జండామాను వద్ద నిర్వహిస్తున్న ల్యాండ్రీలో శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ సమాచారం అందుకున్న పీలేరు ఫైర్ స్టేషన్ సిబ్బంది , పోలీసులు సకాలంలో స్పందించి మంటలు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. పీలేరు అర్బన్ ఎస్ఐ లోకేశ్ తన సిబ్బందితో అక్కడే ఉండి ట్రాఫిక్‌ను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దుస్తులతోపాటు కొంత నగదు కాలి బూడిదైంది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పీలేరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు భవనానికే దిక్కు లేదు.. పర్యాటకుల రక్షణ ఎలా?

- మందుబాబులకు అడ్డాగా హెల్ప్‌డెస్క్ భవనం



హార్సిలీ హిల్స్‌పై పర్యాటకుల రక్షణార్థం నిర్మించిన హెల్ప్‌డెస్క్ భవనం

బి.కొత్తకోట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పర్యాటకుల రక్షణ లక్ష్యంగా హార్సిలీహిల్స్‌లో ఏర్పాటైన పోలీస్‌హెల్ప్ డెస్క్‌కు మకిలి పట్టింది. రాష్ట్రంలోని నాలుగు ప్రముఖ పర్యాటక కేంద్రాలలో పోలీస్ అవుట్‌పోస్టులను అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ అవుట్‌పోస్టులో తగినంత మంది సిబ్బంది ఎల్లవేళలా శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సి వుంది. అది ఎలాగూ అమలు కాలేదు. కాగా , హిల్స్‌పై పర్యాటకులు ఎక్కువగా సంచరించే, రాత్రిళ్లు పార్టీలకు నిలయమైన గాలిబండ వద్ద పోలీస్ హెల్ప్‌డెస్క్ పేరుతో ఓ సుందర భవనాన్ని నిర్మించారు. 2023 నవంబరు 23న అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, కలెక్టర్ గిరీశ ప్రారంభించారు. ఓ కానిస్టేబుల్‌ను ఇక్కడ నియమించి పర్యాటకులకు రక్షణ కల్పించాలని నిర్ణయించారు. కొంతకాలం ఈ విధానం అమలైంది. దీంతో గాలిబండ ప్రాంతంలో ప్రశాంతత నెలకొంది. కొంతకాలంగా ఈ హెల్ప్‌డెస్క్‌ని పట్టించుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. మందుబాబుల చిందులు అధికమయ్యాయి. హెల్ప్‌డెస్క్ భవనాన్నే వేదికగా చేసుకొని మద్యం తాగుతున్నారు. తలుపు బద్దలుకొట్టి లోపల చలిమంటలు సైతం వేసుకునే దుస్థితిక వచ్చారు. దీంతో చీకటి పడితే మహిళలు, పిల్లలతో కలిసి గాలిబండవైపు రావడానికే పర్యాటకులు భయపడే స్థితి నెలకొంది. కొండపై పోలీస్ నిఘా లేకపోవడంతో రాత్రిళ్లు బసచేసిన వారు బిక్కుబిక్కు మంటూ గడపాల్సివస్తోందని వాపోతున్నారు. పర్యాటకుల రక్షణ సంగతి అటుంచి ఆ భవనానికైనా రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.



హెల్ప్‌డెస్క్ భవనంలో ఖాళీ మద్యం సీసాలు

కార్యకర్తలకు గుర్తింపునిచ్చే ఏకైక పార్టీ టీడీపీ : సీఎం



జమ్మలమడుగు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రొద్దుటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను గుర్తించే బాధ్యత నాది... పార్టీదని, మీ బాధ్యత ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండటం అని.. నెలనెలా పెన్షన్లు పంచేటప్పుడు బూత్ కన్వీనర్ ఇంటింటికి వెళ్లి కనపడాలని... మన వల్లే పెన్షన్ వచ్చిందని గుర్తుంచుకుంటారని... రేపు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వారికి సైకిలే కనబడుతుందని.. కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటే టీడీపీని ఓడించడం ఎవ్వరికీ సాధ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చా రు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం ముద్దనూరు రోడ్డులోని నానుబాల ఫంక్షన్ హాలులో జరిగింది. ఈసమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ నాయకులు ప్రజలు ఒప్పుకుంటేనే పార్టీలో రాష్ట్రస్థాయి నుంచి జిల్లా మండలస్థాయి వరకు పదవులు ఇస్తున్నామన్నారు. దేవదాయ పాలకమండళ్లు, మార్కెట్‌యార్డు కమిటీలలో, సాగునీటి సంఘాలలో పదవులు ఇస్తున్నామన్నారు. అన్ని స్థాయిలలో కార్యకర్తలకు గుర్తింపు నిచ్చే ఏకైకపార్టీ టీడీపీనే అన్నారు. అందువల్లే కోటి కుటుంబాలు టీడీపీతో ఉన్నాయన్నారు.

సూపర్‌సిక్స్ సూపర్ సక్సెస్

ఎన్నికల ముందు ప్రజలకు అమ లు చేస్తామన్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయని అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని రీతిలో రూ.32,116 కోట్ల రూపాయలు పెన్షన్లుకు ఇస్తున్నామన్నారు. తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఇచ్చామని, పేదల కోసం అన్నా క్యాంటీన్లు, సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. మత్స్యకారులకు పెన్షన్లు ఇస్తున్నామన్నారు. పదిరోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.7వేలు ఇవ్వనున్నామన్నారు. ఆగస్టు 7న చేనేత కార్మికులకు 200 యూని ట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందజేయనున్నామన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

11 సీట్లిచ్చినా రౌడీయిజం చేస్తున్నారు

రాష్ట్ర ప్రజలు వైసీపీకి 11 సీట్లిచ్చినా రౌడీయిజం చేస్తున్నారు. అబద్ధం నిజం చేస్తారు. నిజాన్ని అబద్ధం చేస్తారు. సాక్షిలో గుండెపోటు అంటే అయ్యోపాపం అనుకున్నా. సాయంకాలంకల్లా గొడ్డలిపోటన్నారు. తెల్లవారగానే నాచేతిలో కత్తిపెట్టి నారాసుర రక్త చరిత్ర అన్నారు. నేను హత్యలు చేసే వాణ్ణి కాదు. హత్యలు చేసేవాళ్లను మట్టికరిపిస్తా. ఫ్యాక్షన్ రాజకీయాల నుంచి రాయలసీమను కాపాడిన పార్టీ టీడీపీ అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం, అమరావతిలను విధ్వంసం చేశారు. నేడు విధ్వంసం నుంచి అభివృద్ధి వైపునకు, అప్పుల ఊబి నుంచి ఆర్థిక సమృద్ధివైపునకు తీసుకెళుతున్నాం అన్నారు. ఇక నేరస్థులు రాజకీయ ముసుగులో వస్తున్నారు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరామర్శలకు వెళ్లి అక్కడి నుంచి బెదిరించడం..నేను వస్తే తాటతీస్తాను అంటున్నారని... నేను రాజకీయాలు చేసేవరకు ఎవరి ఆటలు సాగనీయనన్నారు.

సింగపూరును అవమానించారు

ప్రపంచంలో అవినీతికి తావులేని దేశం సింగపూర్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సింగపూరు ప్రభుత్వాన్ని అవమాన పరిచారన్నారు. టీడీపీ వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులకు నమ్మకం కలిగించామన్నారు. 30 ఏళ్ల నమ్మకంతో నన్ను వారు ఒదులుకోలేక పోయారు. మళ్లీ సింగపూర్‌తో సంబంధాలు మెరుగు పరుస్తున్నానన్నారు.

ప్రాజెక్టులు, పరిశ్రమలపై హామీలు

రైతాంగం కోసం రాజోలి రిజర్వాయర్ నిర్మాణం చేపడతామన్నారు. జమ్మలమడుగులో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాల్మియ సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ పనులు చేపట్టడంతో పాటు ఆర్‌టీపీపీలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

పులివెందుల జడ్పీటీసీ స్థానం గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్ ఇస్తాం : బీటెక్ రవి


విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని కైవశం చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గిఫ్ట్‌గా ఇస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసేందుకు అనుమతి ఇవ్వడంతో నామినేషన్ వేశామన్నారు. నా సతీమణి లతా రెడ్డి, తమ్ముడు భరత్‌రెడ్డిలు నామినేషన్లు వేశారన్నారు. అందరి సహకారంతో పులివెందుల జడ్పీటీసీ స్థానం కైవశం చేసుకుంటామన్నారు. పులివెందులలో టీడీపీ బలపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని.. గత అసెంబ్లీ ఎన్నికలలో 25శాతం పార్టీ ఇక్కడ ఉంటే.. 50 శాతానికి టీడీపీని బలోపేతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలుతో పులివెందులలో టీడీపీ బలపడేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణాల్లో నష్టాలు వస్తాయని వైసీపీ నాయకులు వదిలేసిన గ్రావెల్ రోడ్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తి చేశామన్నారు కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

కడప కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం తథ్యమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా అనిల్‌కుమార్ రెడ్డి, శివకళ్యాణరెడ్డిలు తమ నామినేషన్ పత్రాలను జిల్లా పరిషత్‌లో ఎన్నికల అధికారికి అందజేశారు. అంతకముందు విజయజ్యోతి మీడియాతో మాట్లాడుతూ పులివెందుల కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. వైఎస్ తనయురాలు పీసీసీ అధ్య క్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో పులివెందుల జడ్పీటీసి ఉప ఎన్నికలో విజయం సాధించడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్, పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బ్ర.మఠం ఎంపీపీ వైసీపీకి రాజీనామా


ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల ప్రజాపరిషత్ చైర్మన్ (ఎంపీపీ) చిలేం కాంపల్లె వీరనారాయణరెడ్డి శుక్రవారం వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలతో తాను వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశామన్నారు. రాజీనామా పత్రాన్ని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, వైసీపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి పంపినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే టీడీపీలోకి వెళుతున్నట్లు ఎంపీపీ వెల్లడించారు.

వీరభద్రాలయంలో ఘనంగా రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరయ్య, కృ ష్ణయ్య స్వాముల వేదమంత్రాల మధ్య భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుదరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలను నిర్వహించారు. ఆల య అర్చకుడు శంకరయ్యస్వామి రాహుకాల పూజల విశిష్టత గురించి మ హిళా భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు అన్నా చెల్లెళ్ల ఎంపిక


కడవకల్లు కమ్మయ్య, కడవకల్లు కల్పన

మైలవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దన్నవాడ గ్రామానికి చెందిన అన్నా చెల్లెళ్లు కడవకల్లు కమ్మయ్య, కడవకల్లు కల్పన పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. దన్నవాడ గ్రామానికి చెందిన కడవకల్లు అప్పయ్య, జీవమ్మ దంపతుల కుమారుడు కడవకల్లు కమ్మయ్య, కుమార్తె కడవకల్లు కల్పనలు సివిల్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు. ఐదేళ్ల క్రితం తండ్రి అప్పయ్య మృతి చెందారు. తల్లి జీవమ్మ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేది. తల్లితో పాటు అన్నా చెల్లెలు కూడా కూలి పనులకు, పొలం పనులకు వెళ్లేవారు. ఎటువంటి శిక్షణ తీసుకోకుండా ఇంటిలోనే కష్టపడి చదువుకుని మెరుగైన ఫలితాలు సాధించి కానిస్టేబుల్స్‌గా ఎంపికకావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి విద్యాభ్యాసం 1 నుంచి 5 వరకు దన్నవాడ ప్రభుత్వ పాఠశాల, 6 నుంచి 10 వరకు వద్దిరాల జడ్పీ హైస్కూలు, ఇంటర్, డిగ్రీ జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీల్లో సాగింది.

చేనేత కుటుంబంలో అన్నదమ్ముళ్లకు...


లక్ష్మీనారాయణ, విజయనారాయణ

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఒకే కటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. చింతా చంద్రనారాయణ, శ్యామలాదేవి కుమారులు లక్ష్మీనారాయణ, విజయనారాయణ ఏపీఎస్పీ పోలీసులుగా ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకే కుటుంబంలో వదినా, మరిదికి..

కొండాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన వదినా, మరిదిలు శుక్రవారం విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన రైతు కుమ్మర నాగేంద్ర భార్య పావని, అతని తమ్ముడు కుమ్మర హర్షవర్ధన్‌లు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఒకే కుటుంబంలో ఇద్దరు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో వారి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గండికోట ప్రాజెక్టుకు చేరిన కృష్ణాజలాలు



జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా గండికోట ప్రాజెక్టులోకి చేరుతున్న కృష్ణాజలాలు

కొండాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు కృష్ణా జలాలు శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు చేరినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అవుకు రిజర్వాయిర్ వద్ద జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గురువారం నీటిని విడుదల చేయగా, జీఎన్‌ఎస్‌ఎస్ వరదకాలువ ద్వారా 53 కిలోమీటర్లు ప్రయాణించి గండికోట సొరంగం గుండా గండికోట ప్రాజెక్టులోకి నీరు ప్రవేశించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సుమారు 6000 క్యూసెక్కులు నీరు వస్తుండగా అది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులు, సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 300 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో శుక్రవారం 10.3 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు గల్లంతు

● ఒక మృతదేహం లభ్యం - మరొకరి కోసం పోలీసుల గాలింపు


పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు గల్లంతు అయిన నీటి గుంత ఇదే


మున్నా మృతదేహం

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ముద్దనూరు రోడ్డులోని పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో మునిగి గల్లంతయ్యారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గండికోటకు వెళ్లే సమయంలో వెలుగులోకి వచ్చింది. పోలీసల వివరాల మేరకు... కడపకు చెందిన గోపాల్ (36), మున్నా (38) ముఖ్యమంత్రి పర్యటన బారీకేడ్స్ కట్టేందుకు గురువారం జమ్మలమడుగుకు వచ్చినట్లు తెలిపారు. పనులు అయిపోయిన తర్వాత పెన్నానదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు నీటి కుంటలో మునిగి గల్లంతు అయ్యారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 8 గంటలకు మున్నా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

కులం పేరుతో దూషించిన కేసులో మూడేళ్ల జైలు శిక్ష

సింహాద్రిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన కేసులో వెలుగోటి రామలింగేశ్వరరెడ్డికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. 2018 మే 4వ తేదీ వెలుగోటి రామలింగేశ్వరరెడ్డి చింతలపల్లె అంకాళమ్మకు చెందిన పొలంలో అక్రమంగా ప్రవేశించి గుంతలు తీశాడు. ఈ విషయం తెలుసుకున్న అంకాలమ్మ రామలింగేశ్వరరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఎందుకు మా పొలంలో గుంతలు తీశారు.. మీపైన కేసు పెడతామన్నారు. దీంతో రామలింగేశ్వరరెడ్డి కోపంతో అంకాళమ్మను ఆమె భర్తను కులం పేరుతో తిట్టి దూషించాడు. కేసు కాకపోతే ఏమైనా పెట్టుకోమని బెదిరించినట్లు, పొలాన్ని పాడుచేసి గుంతలు చేసినట్లు కేసు పెట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి రామలింగేశ్వరరెడ్డిని కోర్టులో ప్రవేశపెట్టగా... విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పీపీ బాలాజీ, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారన్నారు.

5 నుంచి వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 5వ తేదీ నుంచి ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు వెల్లడించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన 2వ సెమిస్టర్ విద్యార్థులు హాజ రు కావాలని ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని కళా శాలల విద్యార్థులు యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లను చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సూచించారు.

బంగారు కుటుంబాలను ఆదుకుందాం

మార్గదర్శులతో సీఎం చంద్రబాబు


దీవెన కుటుంబాన్ని దత్తత తీసుకుంటామంటున్న ఎన్‌ఆర్‌ఐ రామమనోహర్‌రెడ్డి (మార్గదర్శి), నాగమ్మ కుంటుంబాన్ని ఆదుకుంటామంటున్న చెన్నారెడ్డి (మార్గదర్శి)

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల్లో ఆర్థికంగా స్థిరపడినవారు సొంతూర్లోని బంగారు కుబుంటాలను ఆదుకోవాలి. ఈ విషయంలో మీరూ మేమూ కలసి వెళదాం.. అని మార్గదర్శులతో సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జమ్మలమడుగు మండలం గూడెంచెరువు చేనేత కాలనీలో పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. ఇక్కడ బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు బంగారుకుటుంబాల్లోని వారు తమ స్థితిగతులను వివరించారు. వారిని ఆదుకుంటా మని అక్కడికక్కడే మార్గదర్శులు ప్రకటించారు. ఆ వివరాలు..

నేను ఎస్‌ఐని అవుతా... పది మందికి సాయపడతా...

నాపేరు దీవెన. బీఏ చదువుతున్నాను. నాన్నకు 2016లో రెండుసార్లు ఆపరేషన్లు జరిగాయి. రూ.6లక్షలు ఖర్చయ్యింది. మాకు చాలా ఇబ్బందులున్నాయి. అయినా నన్ను చదివిస్తున్నాడు. తమ్ముడ్ని కోల్పోయాం. అమ్మకు చెవుడు. మేము చాలా ఇబ్బందుల్లో ఉన్నాము సార్. మాకు సహాయం చెయ్యండి. ఎస్‌ఐని కావాలన్నది నా సంకల్పం సార్. నేను కూడా పదిమందికి సహాయపడతాను.

సీఎం: భూములేమైనా ఉన్నాయామ్మా...

దీవెన: లేవు సార్.

బాబు: మీనాన్న ఏం పనిచేస్తాడమ్మా....

దీవెన: పెయింటింగ్ పనిసార్. ఒకరోజు పని ఉంటే వారం రోజులు పనివుండదు. ఆయన మీదే మేము ఆధారపడి బతుకుతున్నాం సార్. మీరే మాకు సహాయం చెయ్యాలని కన్నీరు పెట్టడంతో సీఎం చంద్రబాబు బాలికను ఓదార్చారు. బాధపడవద్దు నేనున్నాను.

మీరిచ్చిన స్ఫూర్తే...- రామమనోహర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ

దీవెనను నాకు కలెక్టర్ పరిచయం చేశారు. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నాను. దీవెన బాగా చదువుకుని ఎస్‌ఐ కావాలనే లక్ష్యం ఉంది. ఆమె ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తాను. అలాగే ఆమె తండ్రి భాస్కర్ జీవనోపాధి కోసం ఆటో కావాలని అడిగారు. అది కూడా ఏర్పాటు చేస్తాను. పీ4 అనే ఉద్యమం అనేది 2016లో కూడా స్మార్ట్ వార్డు-స్మార్ట్ విలేజ్‌గా చేశారు. మీ పిలుపు మేరకు ప్రస్తుత సీఎస్ విజయానంద్ కలిసి జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని దత్తత తీసుకుని 2019 ఫిబ్రవరి నాటికి సంపూర్ణ ఆదర్శ గ్రామంగా మీ చేతులమీదుగా అవార్డు తీసుకున్నాము. విద్య, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి అన్ని కార్యక్రమాలను దత్తత తీసుకుంటాం సార్. 500 మందికి ఉపాధి కల్పించాము. ఇంకా ఎవరైన అర్హులుంటే వారందరికీ పని కల్పిస్తాం సార్.

బాబు: ఒక విజన్ తయారు చేసి షార్ట్‌టర్మ్, మిడిల్ టర్మ్, లాంగ్ టర్మ్‌గా డెవలప్‌మెంట్ చెయ్యండి. ఎంతమంది ఉంటే అందరినీ హోలిస్టిక్‌గా అభివృద్ధి చేయాలి.

=====================

నాగమ్మ : నా పేరు నాగమ్మ, భర్త లక్ష్మయ్య, మామ నాగయ్య, అత్త బాలమ్మ సార్. మేము వడ్డోళ్లం.

బాబు: పిల్లలేం చేస్తారమ్మా...

నాగమ్మ: ఒకరు చదువుకుంటున్నారు. ఒకరు 8నెలల పాప. మేము రోళ్లు చేసుకుంటూ బతుకుతున్నాము. ప్రస్తుతం చాలా ఇబ్బందిగా ఉంది సార్. గ్యాండరు (గ్రైండరు), మిక్సీలు వచ్చిందానివల్ల యాపారం చానా పడిపోయింది. ఇంట్లోకి ఒక్క రూపాయి కూడా రాదు సార్. దీనివల్ల చాలా ఇబ్బందిగా ఉంది.

బాబు: తల్లికి వందనం పడిందామ్మా

నాగమ్మ: పడింది సార్.

బాబు: గ్యాస్ వస్తోందా...

నాగమ్మ: లేదు సార్.

బాబు: వెంటనే పెట్టుకో కనెక్షన్ ఇస్తారు.

నాగమ్మ కుటుంబాన్ని ఆదుకుంటా... చెన్నారెడ్డి

మైలవరం మండలంలోని చిన్నవెంతుర్ల గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టి 30 సంవత్సరాల క్రితం హైదరాబాదుకు వెళ్లాను సార్. కన్‌స్ట్రక్షన్‌లో బాగా రాణించాను. అక్కడ ముగ్గురు పిల్లల్ని చదివిస్తున్నాను. నాగమ్మ పిల్లలకు కావాల్సిన విద్య, ఆరోగ్యం, భర్తకు ఆటో కూడా ఇప్పిస్తాను సార్. మరో పది కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేస్తాను.

చంద్రబాబు: మీరు మేము కలిసి ముందుకెళదాము.

బడుగుల సంక్షేమమే ధ్యేయం

పింఛన్ మంజూరులో ముందడుగు ● స్పౌజ్ పెన్షన్లు మంజూరు ● పెన్షన్ల పంపిణీని పరిశీలించిన అధికారులు

● పెన్షన్లు పంచిన గౌడ కార్పొరేషన్ అధ్యక్షుడు గురుమూర్తి గౌడ్, పర్యావరణ నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్ దినేష్‌రెడ్డి




నక్కలదిన్నెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న గురుమూర్తి గౌడ్ - చెరువుకిందపల్లెలో ఫింఛన్లు పంపిణీ చేస్తున్న దినేష్‌రెడ్డి, మల్లికార్జుననాయుడు

మదనపల్లె టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం నుంచీ ఎదురు చూస్తున్న స్పౌజ్ పెన్షనర్లకు టీడీపీ ప్రభుత్వంలో మంజూరయ్యాయి. ఇంటి పెద్ద చనిపోవడంతో కుటుంబం జరగక ఇబ్బందులు పడే కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం నారా చంద్రబాబు నడుం బిగించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ అధ్యక్షుడు, మదనపల్లె నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు గురుమూర్తి గౌడ్ నక్కలదిన్నెలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. వివరాల్లోకెళితే.... రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ అధ్యక్షుడు, మదనపల్లె నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు గురుమూర్తి గౌడ్ అన్నారు. శుక్రవారం నక్కలదిన్నెలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలు చేస్తుందన్నారు. 14వ వార్డులో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నేతలు మల్లికార్జునరెడ్డి, షంషీర్, నాదెళ్ల శివన్న, సిమెంట్ రమణ, రవి, ఎమ్మార్పీఎస్ వాసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

ములకలచెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పర్యావరణ నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ సంస్థాగత ఎన్నికల నియోజకవర్గ పరిశీలకుడు దినేష్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు అన్నారు. చెరువుకిందపల్లెలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఇంటింటా పథకాలు వివరించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమణ, నేతలు మూగి రవిచంద్ర, గాలి నారాయణ, సుబ్బి నాయుడు, రామ్మోహన్, కృష్ణమూర్తి, రామకృష్ణ, మంజునాథరెడ్డి నాయుడు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

తంబళ్లపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పాలిస్తోందని రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీదర్ నాయుడు అన్నారు. టీడీపీ గ్రామాధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కన్నెమడుగులో సుపరిపాలనలో తొలి అడుగులో ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం కొత్తగా మంజూరైన 8 స్పౌజ్ పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూమిరెడ్డి, సోముశేఖర్, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సిద్దారెడ్డి, బాలరాజు, నాగసుబ్బారెడ్డి, సాయినాథ్, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, చిన్నరెడ్డి, వెంకట్రమణ పాల్గొన్నారు.

● అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్ అందజేస్తోందని పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర అన్నారు. మండల వ్యాప్తంగా పింఛన్లు, నూతన స్పౌజ్ పింఛన్లను టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి సోమశేఖర్, తంబళ్లపల్లె గ్రామ ఉపాధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి, జయరాం రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ పరిశీలన

నిమ్మనపల్లి ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన పెన్షన్ల పంపిణీని ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు పరిశీలించారు. మండలంలో 5047 పెన్షన్లకు సచివాలయ సిబ్బంది ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకు దాదాపు 96శాతం పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పెన్షన్ దారులు 2వతేదీ సచివాలయాల్లో పొందాలన్నారు. కార్యక్రమలో కార్యదర్శి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

15 సచివాలయాల్లో 124 స్పౌజ్ పెన్షన్లు పంపిణీ

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 సచివాలయాల్లో 124 నూతన స్పౌజ్ పెన్షన్లు ఆయా సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు అందించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు వితంతు పింఛన్లను మంజూరు చేసి లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. పీటీఎంకు 18, తుమ్మరకుంట 5, టి.సదుం 5, సంపతికోట 5, రాపూరివాండ్లపల్లె 8, రంగసముద్రం 9, పట్టివాండ్లపల్లె 8, నవాబుకోట 10, మల్లెల 8, మడుమూరు 9, కాట్నగల్లు 8, కందుకూరు 9, కమ్మచెరువు 9, బూర్లపల్లె 5, అంకిరెడ్డిపల్లె 8 మొత్తం 124 పెన్షన్లను అందించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ పెద్ద వెంకట్రమణ, టీడీపీ నేతలు కట్టా సురేంద్ర నాయుడు, మాజీ ఎంపీటీసీలు శేషాద్రి సురేష్ బాబు, చంద్రశేఖర్ (చిన్న), స్కూల్ కమిటీ చైర్మన్ రాము, మాజీ సర్పంచ్ రియాసత్ అలీ ఖాన్, నందిమూర్తి, కత్తి ఆది, సికిందర్ పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్ల మంజూరు

కలకడ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అర్హులకు ఎన్టీఆర్ పింఛన్ల మంజూరులో ప్రభుత్వం ముందడుగు వేస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు పొత్తూరి ప్రభాకర్‌నాయుడు అన్నారు. శుక్రవారం దేవళపల్లె డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్ రెడ్డితో కలిసి ఆయన పింఛన్ పంపిణీ చేపట్టారు. గుడిబండ టీడీపీ నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. నేతలు ఆనందరెడ్డి, పీరయ్య, ఆంజనేయులు, చంద్రశేఖర్, కార్యదర్శులు రెడ్డి రాణి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.





తంబళ్లపల్లెలో పథకాలను వివరిస్తున్న టీడీపీ నేతలు - నిమ్మనపల్లెలో పెన్షన్ల పంపిణీలో ఎంపీడీఓ రమేష్ తదితరులు - కలకడలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

44867 మందికి 'అన్నదాత సుఖీభవ'

ములకలచెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 44867 మందికి అన్నదాత, పీఎం కిసాన్ సాయం అందనుంది. శనివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.22.43,35,000, పీఎం కిసాన్ కింద 8,97,34,000 విడుదల చేయనున్నారు. తంబళ్లపల్లె మండలంలో 8273 మందికి రూ.4.14 కోట్లు అన్నదాత సుఖీభవ, రూ.1.65 కోట్లు పీఎం కిసాన్, ములకలచెరువులో 7458 మందికి రూ.3.73 కోట్లు అన్నదాత సుఖీభవ, రూ.1,49 కోట్లు పీఎం కిసాన్, పెద్దతిప్పసముద్రంలో 9986 మందికి రూ.4.99 కోట్లు అన్నదాత సుఖీభవ, రూ.2కోట్లు పీఎం కిసాన్, బి.కొత్తకోటలో 7413 మందికి రూ.3.71కోట్లు అన్నదాత సుఖీభవ, రూ1.48 కోట్లు పీఎం కిసాన్, కురబలకోటలో 5463 మందికి రూ.2.73 కోట్లు అన్నదాత సుఖీభవ, రూ.1.09 కోట్లు పీఎం కిసాన్, పెద్దమండ్యంలో 6274 మంది రైతులకు రూ.3.14కోట్లు అన్నదాత సుఖీభవ, రూ.1.25 కోట్లు పీఎం కిసాన్ అందనుంది.

నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ

వాల్మీకిపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ద్వారా రైతు సోదరులకు వారి ఖాతాల్లో శనివారం నిధులు జమ చేయనున్నట్లు వాల్మీకిపురం ఏఓ మురళీమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికీ మొదటి విడతగా రూ.7వేలు జమ చేస్తారన్నారు. మండలంలో 6507మంది రైతులకు రూ.4.55కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని మండలంలోని రైతులందరూ గుర్తించి పథకాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని కోరారు.

పాఠశాలకు సొంత నిధులతో మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న బాలరాజు, సురేంద్ర

తంబళ్లపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కే.రామిగానిపల్లె ప్రాథమిక పాఠశాల నాడు-నేడులో నిలిచిపోయిన పనులను సొంత నిధులతో చేపట్టి శభాష్ అనిపించుకున్నారు ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు, టీడీపీ గ్రామాధ్యక్షుడు సురేంద్ర. వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడులో భాగంగా పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లలో వాష్ బేసిన్లు, పైపులైన్లు, నీటి సౌకర్యం తదితర పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఇదే పాఠశాల ప్రాంగణలో ఉన్న అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు, టీడీపీ గ్రామధ్యక్షుడు సురేంద్ర, హెచ్ఎం శ్రీలత సొంత నిధులతో అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తి చేసి సమస్యను పరిష్కరించారు.

యోగనేలమల్లేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ

నిమ్మనపల్లి ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తవళం అటవీ ప్రాంతంలో వెలసిన యోగనేలమల్లేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠను శనివారం నుంచి మూడు రోజులు నిర్వహించనున్నట్లు ఈఓ మంజుల, చైర్మన్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ శనివారం స్వామి వారికి మహాగణపతి పూజ ఆదివారం శిఖర కలశ స్థాపన, జీవ ధ్వజస్థంభ ప్రతిష్ఠ, సోమవారం నేలమల్లేశ్వస్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠ, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజులు మదనపల్లి చెందిన గుత్తా హరికృష్ణ దంపతులచే అన్నదానంలో జరుగుతుందని తెలిపారు. మండల ప్రజలు హజరై దేవదేవుని కృపను పొందాలని కోరారు.

పాడి రైతులకు మెరుగైన సేవలందించాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలని మదనపల్లె పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ నాయుడు అన్నారు. స్థానిక పశు వైద్య కేంద్రంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల సిబ్బందితో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరువ చేయాలని సూచించారు. పశు వైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ పాడి రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. సహాయ సంచాలకులు సుమిత్ర, పశువైద్యాధికారులు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, చరిత పాల్గొన్నారు.

మదనపల్లెలో స్పెషల్ డ్రైవ్

మదనపల్లె అర్బన్, ఆగ స్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డు లో శుక్రవారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పట్ట ణంలోని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చారు. ఇందులో భాగం గా 200 వాహనాలకు జరిమానా విధించారు. అన్ని వాహనాల రికార్డులు పరిశీలించారు. బెంగళూరు రోడ్డులో మూడు చోట్ల, అనిబీసెంట్ సర్కిల్, హెడ్ పోస్టాఫీస్ వద్ద వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. సీఐలు కళావెంకటరమణ, రామచంద్ర, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారంలో నిండిన మురికినీటి కాల్వలు



ములకలచెరువు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రామాపురంలో మురికినీటి కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు ముందుకు కదలక, దుర్వాసన వెదజల్లుతోంది. సాయంత్రమైతే చాలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. చెత్తాచెదారం సేకరించకపోవడంతో పెద్ద ఎత్తున చెత్తాచెదారం నిల్వ ఉంది. పారిశుధ్యం మరీ అధ్వానంగా తయారైంది. మండల కేంద్రానికి ఆనుకుని ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి :సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ సీఐ యుగంధర్

పీలేరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. శుక్రవారం కోటపల్లె బాలికల ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ లక్కీడిప్ తగిలిందని, ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి సెల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమంటే అత్యాశకు పోయి చెబితే మీ ఖాతాలోని సొమ్ము ఖాళీ అవుతుందని హెచ్చరించారు. పోక్సోచట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ఎం బాబురెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దతిప్పసముద్రం ఎస్ఐ హరిహరప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం ఆయన మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ శివకుమారితో కలిసి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్, పోక్సో, సైబర్ క్రైం, సెక్యూరిటీ, రోడ్డుభద్రత, మాదకద్రవ్యాలు, వివిధ చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

గుర్రంకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ, విద్యార్థులు చదువుపట్ల శ్రద్ధచూపి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని హెచ్‌సీ దశరథ అన్నారు. గుర్రంకొండ జూనియర్ కాలేజీలో విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలన్నారు. లైంగిక వేధింపులు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలాకర్, అధ్యాపకులు జమీర్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కనకాంబరం అలంకరణలో కోర్టులో గంగమ్మ



మదనపల్లె అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలోని గంగమ్మకు శుక్రవారం కనకాంబరాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాహుకాలంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమ్మకాయలపై దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు జోలెపాళెం కరుణాకర్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

5న ధర్నా జయప్రదం చేయండి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారానికి వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాలు 5వ తేదీన చేపడుతున్న ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసనను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు,సీపీఎం రాష్ట్ర సమితి సభ్యులు కృష్ణప్ప పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ జగన్ ప్రారంభించిన స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు, ఎఫ్‌పీపీసీఏ చార్జీలు సెకీ ఒప్పందం, అదానికి భూములు అప్పగింత వంటి విధానాలను చంద్రబాబు కూడా కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న జన్‌కో నుంచి విద్యుత్ తీసుకోకుండా ప్రైవేట్ నుంచి అధిక ధరతో కొనుగోలు చేస్తూ ప్రజల నెత్తిన భారం మోపుతున్నారని తెలిపారు. సెకీ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రస్తుత ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ కోర్టులో కేసులు వేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు,వీఆర్ ఎస్ఎస్ నేత పొదల నరసింహులు పాల్గొన్నారు.

టీడీపీ తోనే ప్రజా సంక్షేమం

పెద్దమండ్యం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) టీడీపీ తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని మండల టీడీపీ నేతలు పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో అధికారులు, కూటమి నేతలు వితంతువులకు పింఛన్లను పంపిణీ చేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ప్రభుత్వ పథకాలపై సమష్టిగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 92 వితంతు పింఛన్లు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు వెల్లడించారు. పింఛన్‌ల పంపిణీలో నేతలు సిద్దవరం ప్రసాద్, యుగంధర్‌రెడ్డి, బీటెక్ సుమన్, గంగాధర, మహేశ్వర, కాలేషా, గల్లా నారాయణ, ప్రభాకరరెడ్డి, చలపతి, నాగేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, రామాంజులునాయుడు, సాంబ, పీరాన్, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు సంజీవినితో సమానం



తల్లులకు సూచనలిస్తున్న వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న

కలికిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు సంజీవిని వంటిదని అధికారులు సూచించారు. ప్రతి బిడ్డ పుట్టిన అరగంటలోపు శిశువుకు ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆరోగ్య, వైద్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా మేడికుర్తి పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో తల్లులకు అవగాహన కల్పించారు. తల్లి పాలకు ప్రత్యామ్నాయంగా ఏదీ సరితూగదని స్పష్టం చేశారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు బిడ్డకు బలవర్ధకమైన ఆహారమని, రోగ నిరోధక శక్తి పెంచుతుందన్నారు. శిశువుకు తల్లిపాలు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుందన్నారు. తల్లికీ, బిడ్డకు మధ్య బంధం బలపడటానికి దోహదపడుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యురాలు లక్ష్మీప్రసన్న, ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, గిరిజమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుంధతి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



ములకలచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ములకలచెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేపట్టారు. వైద్యాధికారి జాహ్నవిరెడ్డి, సిబ్బంది ఇందిర, ఖాదర్‌బాషా, శంకర, ప్రసాద్, అశ్విని, రూహి, ఆశ కార్యకర్తలు అమరావతి, మునిరత్న, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

బి.కొత్తకోట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు గొప్పదనాన్ని, ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యమ్మ పేర్కొన్నారు. ఆగస్టు 1నుంచి 7వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అంగన్వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మూడేళ్ల వరకూ తల్లిపాలను బిడ్డకు పట్టించవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకుని తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. సూపర్‌వైజర్ జయరాణి, కార్యకర్త జయశ్రీ, తల్లులు పాల్గొన్నారు.

బుద్ధ విగ్రహం ధ్వంసంపై సిట్ కోరడం నేరమా?

మీడియా సమావేశంలో ప్రజాసంఘాల డిమాండ్

మదనపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నల్లగుట్టపై ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహం ధ్వంసం ఘటనలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్‌టీం(సిట్) ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం నేరమా? అంటూ ప్రజాసంఘాలు ప్రశ్నించాయి. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సీపీఎం, వీసీకే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నేతలు మాట్లాడుతూ చిన్నపిల్లల ఆటలో బుద్ధుడి విగ్రహం తల విరిగిపోయిందని, వారిలో ఒకరు మతిస్థిమితం లేదని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రకటన నమ్మలేనిదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, వీసీకే రాష్ట్ర కార్యదర్శి ముత్యాల మోహన్, బాస్ రాష్ట్ర కార్యదర్శి టి.ఎ.పీర్‌బాషా, గిరిజన సంఘం రాష్ట్ర నేత దివాకర్, వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, వాల్మీకి సంఘం నేత సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

టమోటా మొక్కలు పీకేశారని ఫిర్యాదు

రామసముద్రం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లెకు చెందిన హరి పొలంలో నాటిన టమోటా మొక్కలు గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పీకేశారని రైతు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరి వైసీపీ కార్యకర్త కావడంతో మదనపల్లె వైసీపీ సమన్వయ కర్త నిసార్‌అహ్మద్ గొల్లపల్లెకు విచ్చేసి పీకేసిన టమోటా మొక్కలు పరిశీలించి హరిని పరామర్శించారు.

టమోటా మండి యజమాని ఆకస్మిక మృతి

బి.కొత్తకోట, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో టమోటా మండి నిర్వహిస్తున్న కనకంటి నరేంద్ర(45) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. మృతుడికి భార్య ముగ్గురు కుమార్తెలు మోక్షిత, మౌనశ్రీ, మహాశ్రీ ఉన్నారు. టమోటా మండి యజమానిగానే కాకుండా వ్యక్తిగత పరిచయాల ద్వారా బి.కొత్తకోటలోనే కాకుండా చుట్టుపక్కల మండలాలకు సైతం సుపరిచితుడైన నరేంద్ర హఠాన్మరణం పట్ల పలువురు ప్రముఖులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కలికిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 సంవత్సరానికి కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు కోరారు. ఖాళీ సీట్లను భర్తీ చేయడం కోసం సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు ఈ నెల 4వ తేదీ సాయంకాలం 5 గంటల్లోగా నేరుగా దరఖాస్తులు అందజేసి మరుసటి రోజు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరవాలని కోరారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా మహేష్



మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న బీఎస్పీ నేతలు మల్లికార్జున, సోమశేఖర్

ములకలచెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ మండల అధ్యక్షుడిగా వేపూరికోటకు చెందిన పూడు మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేపూరికోటలో జరిగిన బీఎస్పీ సమావేశంలో నియోజక వర్గ ఇన్‌చార్జి పెద్దపాళ్యం మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ అధ్యక్షతన మండల అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. భాస్కర్, వినోద్, కృష్ణప్ప, రామాంజులు, సురేష్, మహేందర్, చెన్నకేశవ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవిప్రకాష్



బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రవిప్రకాష్, ప్రసాద్

వాల్మీకిపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.రవిప్రకాష్ విజయం సాధించారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా ఎం.రవిప్రకాష్, జనరల్ సెక్రటరీగా ఆర్.వి.ప్రసాద్ ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడికి స్థానిక న్యాయవాదులందరూ అభినందనలు తెలియజేశారు. మాజీ అధ్యక్షుడు ఆనందకుమార్, న్యాయవాదులు పీజీ విభాకర్ రెడ్డి, ద్వారకనాథరెడ్డి, రమణ, రాగ్యారి చంద్రశేఖర్, చింతమాని లక్ష్మీనరసింహయ్య, మహిత, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.